TGTEL/26/A4846

# నవ సంఘర్షణ

తెలుగు దినపత్రిక

www.navasangharshana.com

CEO &chief editor: Medi Naresh

హైదరాబాద్ సంపుటి: 01. సంచిక: 9 ఆదివారం 9-08-2026 చీఫ్ ఎడిటర్: మేడి నరేష్ పేజీలు-8 వెల :2.00/-

## భారత్‌పై 100% సుంకాలు?

### బిల్లుకు అమెరికన్ సెనేట్ ఆమోదం




వాషింగ్టన్, ఆగస్టు 8. నవ సంఘర్షణ

రష్యా నుంచి చమురు, గ్యాస్‌ను ప్రధానంగా కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారాన్ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కల్పించే ఒక బిల్లును అమెరికా సెనేట్ శుక్రవారం ఆమోదించింది. దీంతో కొత్త వాణిజ్య ఆంక్షల ప్రమాదం ఉన్న దేశాల జాబితాలో భారత్ కూడా చేరింది. రష్యా, ఇరాన్‌లపై ఆంక్షలు విధించే లిండ్సే ఓ గ్రాహమ్ చట్టం-2026ను సెనేట్ 86-11 ఓట్ల తేడాతో ఆమోదించింది. ఇప్పుడు ఈ బిల్లు ప్రతినిధుల సభకు(హౌస్ ఆఫ్ రిప్రెంజెటిటివ్స్) వెళుతుంది. ముందుగా ఈ బిల్లు చట్టంగా మారి ఆ తర్వాత వాటిని విధించాలా వద్దా అనే విషయంలో ట్రంప్‌కు నిర్ణయాధికారం ఉంటుంది. ఈ బిల్లు అమెరికాకు జరిగే భారతీయ ఎగుమతులపై మరిన్ని సుంకాలు విధించే ముప్పును కలిగిస్తున్నది. రష్యా నుండి చమురు, సహజ వాయువును అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్న చైనా, భారత్, అజర్‌బైజాన్, హంగేరీ, స్లోవేకియా వస్తువులపై 100 శాతం వరకు సంకాలు విధించే అవకాశం ఏర్పడింది.

## అరుణాచల్‌లో 27 ప్రాంతాలకు భారత్ కొత్త పేర్లు




- చైనా పేర్లకు కౌంటర్‌గా ఇండియా నిర్ణయం
- సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లో కొత్తగా గుర్తింపు
- స్థానికులకు సులభంగా గుర్తించేలా పేర్ల మార్పు
- లాంగ్‌జూకు కూడా కొత్త మ్యాప్‌లో చోటు
- 1959లో భారత్-చైనా ఉద్రిక్తతలకు వేదికగా లాంగ్‌జూ
- లాంగ్‌జూ సమీపంలోని మాజా గ్రామానికి గుర్తింపు
- థాగ్‌లా ప్రాంతం కూడా కొత్త జాబితాలోకి
- 1962 ఘర్షణ జరిగిన ప్రాంతానికి అధికారిక గుర్తింపు
- జైరాంపూర్ సహా పలు ప్రాంతాలకు కొత్త పేర్లు
- జోలా, రిజాలా, పుకుర్‌లా ప్రాంతాలకు కొత్త పేర్లు
- చైనా 'జాంగ్‌నాన్'గా పిలుస్తున్న అరుణాచల్‌ప్రదేశ్

## బీజేపీ, ఆరెస్సెస్‌లపై ఖర్గే ఫైర్




- స్వాతంత్ర్య పోరాటంలో వారి పాత్ర శూన్యం
- దేశభక్తి పాఠాలు చెప్పే హక్కు బీజేపీకి లేదు
- బీజేపీ, ఆరెస్సెస్ నేతలెవరూ జైలుకు వెళ్లలేదు
- కాంగ్రెస్‌దే నిజమైన దేశభక్తి: ఖర్గే
- బెదిరింపులకు కాంగ్రెస్ భయపడదు
- రాజ్యాంగ పరిరక్షణకు రాహుల్ పాదయాత్ర
- క్విట్ ఇండియా ఉద్యమాన్ని గుర్తుచేసిన ఖర్గే
- 'డూ ఆర్ డై' నినాదంతో ఏకమైన ప్రజలు
- ఉత్తరాఖండ్ సైనికుల త్యాగాలకు ఖర్గే ప్రశంసలు
- దేశ రక్షణలో ఉత్తరాఖండ్‌ది కీలక పాత్ర
- స్వాతంత్ర్య పోరాటం, రాజ్యాంగమే ఎన్నికల అస్త్రాలు

## ప్రాజెక్టుల భూసేకరణకు రూ. 5వేల కోట్లు

### అటవీ, పర్యావరణ అనుమతుల్లో నిర్లక్ష్యం వద్దు

- మిడ్‌మానేరు ఎడమ కాలువ పనుల పునఃప్రారంభం
- పత్తిపాక రిజర్వాయర్ పనులు వేగవంతం
- 10 వేల ఎకరాలకు కొత్తగా సాగునీరు
- రోళ్లవాగు ప్రాజెక్టు పనులు 96 శాతం పూర్తి
- 15 వేల ఎకరాలకు సాగునీటి భరోసా
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

సాగునీటి ప్రాజెక్టుల పనులకు నిధుల కొరత అడ్డంకిగా మారకూడదని, ముఖ్యంగా భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్, అటవీ, పర్యావరణ అనుమతుల విషయంలో ఎలాంటి జాప్యం సహించబోమని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. నాలుగున్నరేళ్లుగా నిలిచిపోయిన మిడ్‌మానేరు ఎడమ కాలువ మిగులు పనులను వెంటనే పునఃప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల నిర్మాణంలో సవరించిన అంచనాలు, భూసేకరణ, టెండర్లు, చట్టబద్ధ అనుమతుల ప్రక్రియలను సమాంతరంగా పూర్తి చేయాలని సూచించారు.

హైదరాబాద్

సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, పునరావసం కోసం రూ.5 వేల కోట్లు మంజూరు చేశామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. నిధుల కొరత కారణంగా సాగునీటి పనులు ఆగొద్దని పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లోని బీర్.అంబేద్కర్ సచివాలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, డి. శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఇందులో ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదలయ్యాయనీ, మిగిలిన రూ.3 వేల కోట్లు ప్రాధాన్యతా క్రమంలో విడుదల చేస్తామని చెప్పారు. నిధుల కొరత కారణంగా చివరి దశలో ఉన్న ఏ సాగునీటి ప్రాజెక్టు కూడా నిలిచిపోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్,

-మిగతా 2 లో






## ప్రశ్నించడమే కాదు.. పరిష్కారం చూడాలి

### సమస్యలకు భయపడవద్దు

- నిత్య విద్యార్థులే విజేతలు
- మహిళల భాగస్వామ్యం పెరగాలి
- స్టార్టప్‌లకు అడ్డాగా ఐఐటీ ఢిల్లీ
- పరిశోధనలపై దృష్టి పెట్టాలి
- చిప్‌ల నుంచి షిప్‌ల వరకు అన్నీ మీ చేతుల్లోనే
- ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో ప్రధాని మోడీ పిలుపు

న్యూఢిల్లీ:

ప్రశ్నించడంతో సరిపుచ్చక సమాధానం కనిపెట్టాలని జేఎన్‌టీయూ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. శనివారం ఇక్కడ జరిగిన ఐఐటీ ఢిల్లీ 57వ స్నాతకోత్సవంలో మాట్లాడుతూ ఉత్సాహంగా ఉండాలని, ఆమోద యోగ్యమైన ఆలోచనలపై ప్రశ్నలు వేయాలని, నిరంతరం నేర్చుకుంటూ ఉండాలని గ్రాడ్యుయేట్లను కోరారు. సవాళ్లను అవకాశాలుగా మార్చాలని వికసిత్ భారత్ దిశగా భారత ప్రయాణానికి తోడ్పడాలని కూడా ఆయన ఉద్బోధించారు. జీవితం లో ఉత్సుకతను సజీవంగా ఉంచండి. నేర్చుకునే సహజ ధోరణిని మేల్కొలపండి, ఆలోచన లేకుండా అంగీకరించే విషయాలను ప్రశ్నించాలని,

-మిగతా 2 లో



## నేడు తెలుగు రాష్ట్రాలలో వర్షాలు

- బంగాళాఖాతంలో కొత్తగా అల్పపీడనం
- రుతుపవన ద్రోణికి తోడైన ఈదురుగాలులు
- ఏపీ, యానాం, తెలంగాణలో మోస్తరు వర్షాలు
- ఉత్తర కోస్తాలో ఉరుములు, మెరుపులతో జల్లులు
- గంటకు 40-50 కి.మీ. వేగంతో గాలులు
- దక్షిణ కోస్తాలోనూ వర్షాలు, ఈదురుగాలులు
- రాయలసీమలో రెండు రోజుల పాటు వర్ష సూచన
- తెలంగాణలో అక్కడక్కడ మోస్తరు వర్షాలు
- రాష్ట్రానికి భారీ వర్ష హెచ్చరికలు లేవు
- వర్షాల వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- తీర ప్రాంత ప్రజలు, ప్రయాణికులకు అధికారుల సూచన

అమరావతి / హైదరాబాద్ :

తెలుగు రాష్ట్రాల వాతావరణంలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. నైరుతి బెంగాల్, దానిని ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని అనుబంధ ఆవర్తనం సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రాగల మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, యానాం, తెలంగాణ వ్యాప్తంగా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.

-మిగతా 2 లో



## డిగ్రీతోనే ఉద్యోగం రాదు..

- నైపుణ్యాలుంటేనే ఉపాధి అవకాశాలు
- క్లాస్‌రూమ్, వర్క్‌ప్లేస్ రెండు వేర్వేరు ప్రపంచాలుగా ఉండకూడదు
- పతి విద్యార్థి కళాశాల నుంచి కేవలం డిగ్రీతో బయటకు రాకుండా నైపుణ్యంతో రావాలి
- 10 వేల మంది విద్యార్థులకు పరిశ్రమల సహకారంతో శిక్షణ
- టెక్నాలజీ మారుతోంది.. పరిశ్రమలు మారతాయి
- నేర్చుకోండి.. మార్పుకు అనుగుణంగా మారండి
- ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

హైదరాబాద్ :

మార్కుల మెమోలతో డిగ్రీలను అందించే వ్యవస్థ నుంచి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, ఆత్మవిశ్వాసంతో కూడిన యువతను తయారు చేసే గమ్యం వైపు తెలంగాణ అడుగులు వేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. విద్య, పరిశ్రమ, ఉపాధిని ఒకే వేదికపైకి తీసుకువచ్చే యువతను భవిష్యత్ ఉద్యోగాలకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రాయదుర్గంలోని టీ--హబ్ ప్రాంగణంలో శనివారం జరిగిన ఫ్యూచర్ స్కిల్స్ సమ్మిట్--అవార్డ్స్ 2026 కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు. క్వాలిటీ థాట్ ఫ్యూచర్ స్కిల్స్ ఫౌండేషన్ పరిశ్రమ, విద్యాసంస్థలు, యువతను ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీయమని ఈ సందర్భంగా అన్నారు. తెలంగాణలో ఇంజనీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్,

-మిగతా 2 లో

## ఎస్ఐఆర్‌పై బీజేపీ శ్రేణులు దృష్టి సారించాలి



- అర్హులైన వారందరితో ఓటు హక్కు నమోదు చేయించాలి
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి
- బీజేపీ అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు

హైదరాబాద్ :

తెలంగాణలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ రెండవ విడత ప్రక్రియపై బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ 'విశ్వేశ్వరయ్య భవన్'లో బీజేపీ -మిగతా 2 లో



## నేడు నర్సంపేటకు కేసీఆర్

- పెద్ది కుటుంబాన్ని పరామర్శించనున్న బీఆర్ఎస్ అధినేత
- ఎర్రబెల్లి ఫాం హౌస్ నుంచి బయలుదేరనున్న కేసీఆర్
- ఉద్యమ సహచరుడి కుటుంబానికి కేసీఆర్ భరోసా
- బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పెద్ది సుదర్శన్‌రెడ్డి సేవలు
- తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాటం
- కుటుంబ సభ్యులను పరామర్శించనున్న గులాబీ దళపతి
- పెద్ది కుటుంబానికి ఇప్పటికే రూ.2.25 కోట్ల సాయం ప్రకటన

హైదరాబాద్

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని ఆ పార్టీ అధినేత కేసీఆర్ నేడు పరామర్శించనున్నారు. ఆదివారం ఉదయం ఎర్రబెల్లి ఫాం హౌస్ నుంచి బయలుదేరి నర్సంపేట నియోజకవర్గం లోని పెద్ది స్వగ్రామమైన నల్లబెల్లికి వెళ్ళనున్నారు. బీఆర్ఎస్ పార్టీ స్థాపించిన నాటి నుంచి నిబద్ధతతో పనిచేస్తూ, తెలంగాణ కోసం జరిగిన

-మిగతా 2 లో

## మహిళా బిల్లుపై మాటల యుద్ధం

### ఆమోదించిన చట్టాన్ని అమల్లోకి తేవాలి

- ఇప్పటికే మద్దతిచ్చాం.. అమలు చేయండి : రాహుల్
- షరతులు లేకుండా మద్దతు ఇవ్వండి : కిరణ్ రిజిజు
- రాహుల్ గాంధీ-కిరణ్ రిజిజు మధ్య మాటల యుద్ధం
- డీలిమిటేషన్‌తో ముడి పెట్టకుండా అమలు చేయాలని డిమాండ్
- డీలిమిటేషన్‌పై విపక్షాల ఆందోళన



న్యూఢిల్లీ,

మహిళా రిజర్వేషన్ చట్టం అమలుపై అధికార, ప్రతిపక్షాల మధ్య మరోసారి మాటల యుద్ధం మొదలైంది. 2023లో పార్లమెంట్ ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టాన్ని ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ఎంపీ రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్లను లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియతో ఎందుకు ముడిపెడుతున్నారని ఆయన ప్రశ్నించారు. ఇటీవల మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ ఘాటుగా స్పందించారు. మహిళా రిజర్వేషన్ విషయంలో రాహుల్ ఆలోచనా విధానంలో మార్పు కనిపిస్తోందని రిజిజు వ్యాఖ్యానించారు. అదే స్ఫూర్తితో మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ ఎలాంటి షరతులు లేకుండా మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు.

-మిగతా 2 లో

TGTEL/26/A4846
నవ సంఘర్షణ
తెలుగు దినపత్రిక
www.navasangharshana.com
ఆదివారం 9 -08-2026

# అరుణాచల్‌లో 27 ప్రాంతాలకు భారత్ కొత్త పేర్లు

- చైనా పేర్లకు కౌంటర్‌గా ఇండియా నిర్ణయం
- సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లో కొత్తగా గుర్తింపు
- స్థానికులకు సులభంగా గుర్తించేలా పేర్ల మార్పు
- లాంగ్‌జూకు కూడా కొత్త మ్యాప్‌లో చోటు
- 1959లో భారత్-చైనా ఉద్రిక్తతలకు వేదికగా లాంగ్‌జూ
- లాంగ్‌జూ సమీపంలోని మాజా గ్రామానికి గుర్తింపు
- థాగ్‌లా ప్రాంతం కూడా కొత్త జాబితాలోకి
- 1962 ఘర్షణ జరిగిన ప్రాంతానికి అధికారిక గుర్తింపు
- జైరాంపూర్ సహా పలు ప్రాంతాలకు కొత్త పేర్లు
- జోలా, రిజాలా, పుకుర్‌లా ప్రాంతాలకు కొత్త పేర్లు
- చైనా 'జాంగ్‌నాన్'గా పిలుస్తున్న అరుణాచల్‌ప్రదేశ్



**న్యూఢిల్లీ:**
అరుణాచల్ ప్రదేశ్‌లో 27 ప్రదేశాలకు భారత్ కొత్త పేర్లను పెట్టింది. ఆ రాష్ట్రానికి చెందిన కొన్ని ప్రదేశాలకు చైనా పేర్లు పెడుతున్న నేపథ్యంలో.. దానికి కౌంటర్‌గా ఇండియా కూడా కొత్త పేర్లను ఫిక్స్ చేసింది. భారతీయ మ్యాప్‌లో సుమారు 27 ప్రదేశాలను గుర్తించి .. వాటికి ఇండియా కొత్త పేర్లను పెట్టింది. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లో ఆ ప్రదేశాలను గుర్తించారు. స్థానికులు గుర్తుపట్టే రీతిలో ఆ పేర్లను పెట్టినట్లు ప్రకటనలో తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రదేశాలకు చైనా పేర్లు పెట్టడాన్ని భారత్ వ్యతిరేకించిన విషయం తెలిసిందే. వాస్తవాధీన రేఖ వెంట ఉన్న లాంగ్ జూ ప్రాంతం కూడా కొత్తగా పేరు పెట్టిన ప్రదేశంలో ఉన్నది. ఇక్కడే 1959లో ఇండియా, చైనా మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ ప్రాంతంలోకి చైనా దళాలు ఎంటర్ అయ్యాయి.లాంగ్ జూ సమీపంలో ఉన్న మాజా అనే గ్రామాన్ని కూడా కొత్త మ్యాప్‌లో మార్క్ చేశారు. ఇది అప్పర్ సుబన్‌సిరి జిల్లాలో ఉన్నది. పర్వత ప్రాంతాలైన జో లా, రిజా లా, పుకుర్ లాతో పాటు బిసా గ్రామం కూడా కొత్త లిస్టులో ఉన్నది. హై ఆల్టిట్యూడ్ పాసేజ్‌లో థాగ్ లా ఉన్నది. 1962లో ఇదే ప్రాంతంలో భారత్, చైనా మధ్య ఘర్షణ జరిగింది. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని కూడా అధికారికంగా మ్యాప్‌లో గుర్తించారు. చాంగ్‌లాంగ్ జిల్లాలో ఉన్న జైరాంపూర్‌ను కూడా లిస్టులో పెట్టారు. సాంబో సరోవర్, బారా కుందన్, చోటా కుందన్, దాన్ బారి, ప్రీత్‌నగర్, తెరిత్నగర్, రామ్‌నగర్, జశ్వంత్ ఘర్, సాగర్, పద్మ, జ్యోతినగర్, బైసాకి ప్రాంతాలు కొత్త లిస్టులో ఉన్నాయి. షేర్ ఏ తప్పా స్మారకం, చోటా రూపక్, బారా రూపక్, శివాజీ నగర్, సున్పురా, కమలాంగ్ నగర్, కమలాంగ్ సాంక్చురీ, బుద్ధామందిర్ కూడా జాబితాలో ఉన్నాయి. అరుణాచల్ ప్రదేశాన్ని .. జాంగ్‌నాన్ అని చైనా పిలుస్తున్నది.

# బీజేపీ, ఆరెస్సెస్‌లపై ఖర్గే ఫైర్

- స్వాతంత్ర్య పోరాటంలో వారి పాత్ర శూన్యం
- దేశభక్తి పాఠాలు చెప్పే హక్కు బీజేపీకి లేదు
- బీజేపీ, ఆరెస్సెస్ నేతలెవరూ జైలుకు వెళ్లలేదు
- కాంగ్రెస్‌దే నిజమైన దేశభక్తి: ఖర్గే
- బెదిరింపులకు కాంగ్రెస్ భయపడదు
- రాజ్యాంగ పరిరక్షణకు రాహుల్ పాదయాత్ర
- క్విట్ ఇండియా ఉద్యమాన్ని గుర్తుచేసిన ఖర్గే
- 'డూ ఆర్ డై' నినాదంతో ఏకమైన ప్రజలు
- ఉత్తరాఖండ్ సైనికుల త్యాగాలకు ఖర్గే ప్రశంసలు
- దేశ రక్షణలో ఉత్తరాఖండ్‌ది కీలక పాత్ర
- స్వాతంత్ర్య పోరాటం, రాజ్యాంగమే ఎన్నికల అస్త్రాలు



కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే భారతీయ జనతా పార్టీ పైన, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పైన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాత్ర శూన్యమని, వారి నుంచి కాంగ్రెస్ పార్టీ దేశభక్తి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.బీజేపీ లేదా ఆర్ఎస్ఎస్ నాయకులెవరూ దేశ స్వాతంత్ర్యం కోసం జైలుకు వెళ్లలేదని ఖర్గే మండిపడ్డారు. ఒకవేళ ఎవరైనా జైలుకు వెళ్లి ఉంటే, వారు గతంలో కాంగ్రెస్‌లో ఉండి ఆ తర్వాత మారినవారే తప్ప అసలైన బీజేపీ/ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్నవారు కాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడమే కాకుండా, ప్రజాస్వామ్యాన్ని రక్షించిందని, కాంగ్రెస్ నాయకులే నిజమైన దేశభక్తులని ఆయన స్పష్టంచేశారు. బెదిరింపులకు కాంగ్రెస్ పార్టీ భయపడదని ఖర్గే ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షణ కోసం కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారని కొనియాడారు. బీజేపీ నాయకుల్లా కాకుండా రాహుల్ గాంధీ స్వయంగా ప్రజల్లోకి వెళ్తూ యువకులు, రైతులు, విద్యార్థులు, పేదల సమస్యలను అర్థం చేసుకుంటున్నారని అన్నారు. ఆగస్టు 8న మహాత్మా గాంధీ ప్రారంభించిన 'క్విట్ ఇండియాస ఉద్యమాన్ని ఖర్గే ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. 'డూ ఆర్ డై' నినాదంతో దేశ ప్రజలంతా ఏకమై బ్రిటిష్ పాలకులను పారద్రోలారని ఖర్గే అన్నారు. దేవభూమిగా పేరొందిన ఉత్తరాఖండ్ సైనికుల త్యాగాలను ఆయన ప్రశంసించారు. కుమావూన్, గర్వాల్ రెజిమెంట్ల ప్రాముఖ్యాన్ని, తొలి పరమ్ వీర్ చక్ర గ్రహీతను స్మరించుకుంటూ, ఉత్తరాఖండ్ ప్రజలు దేశ రక్షణలో కీలకపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. కాగా, హల్ద్వానీలోని రామ్‌లీలా మైదానంలో ఇవాళ జరిగిన ఈ బహిరంగ సభ ద్వారా కాంగ్రెస్ పార్టీ.. రాబోయే ఎన్నికల బరిలో తమ స్వాతంత్ర్య పోరాట చరిత్రను, రాజ్యాంగ పరిరక్షణను ప్రధాన అస్త్రాలుగా మలచుకుని ముందుకు సాగనున్నట్లు చాటిచెప్పింది.

# మహిళా బిల్లుపై మాటల యుద్ధం

మొదటి తరువాయి

రిజిజు వ్యాఖ్యలకు సమాధానంగా రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా కేంద్రాన్ని నిలదీశారు. 2023లో పార్లమెంట్ ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టానికి కాంగ్రెస్ ఇప్పటికే పూర్తి మద్దతు ఇచ్చిందని గుర్తుచేశారు. బిల్లును పార్లమెంట్ లో ఆమోదించే సమయంలోనే తమ పార్టీ వైఖరిని స్పష్టంగా వెల్లడించామన్నారు. చట్టం ఆమోదమై దాదాపు మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు తీసుకొచ్చిన చట్టాన్ని అమలు చేయకుండా, దాని అమలును డీలిమిటేషన్ ప్రక్రియతో అనుసంధానం చేయడం ఎందుకని నిలదీశారు. మహిళా రిజర్వేషన్లకు కొత్తగా ఎలాంటి షరతులు విధించకుండా, ఇప్పటికే ఆమోదించిన చట్టాన్ని అమలు చేయాలని కేంద్రాన్ని కోరారు. ఇదిలా ఉండగా, మహిళా శక్తిపై రాహుల్ గాంధీ మాట్లాడిన వీడియోను కాంగ్రెస్ సోషల్ మీడియాలో విడుదల చేసింది. భారత మహిళా శక్తి పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావడం లేదని ఆయన పేర్కొన్నారు. రాజకీయాలు, వ్యాపార రంగాల్లోనే కాకుండా సొంత ఇళ్లల్లోనూ మహిళలకు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం ఉండటం లేదని అన్నారు. మహిళలు తమను తాము వ్యక్తపరచుకోలేని, స్వేచ్ఛగా ఆలోచించలేని పరిస్థితుల్లో ఏ దేశమూ పూర్తి స్థాయిలో అభివృద్ధి సాధించలేదని రాహుల్ పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉందని, వారి గొంతు రాజకీయ వ్యవస్థలో మరింత బలంగా వినిపించాల్సిన అవసరం ఉందని అన్నారు.

విమర్శలు.. కౌంటర్లతో రాజకీయ వేడి

రాహుల్ వ్యాఖ్యలపై కిరణ్ రిజిజు స్పందిస్తూ కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. మహిళల విషయంలో రాహుల్ గాంధీ ఆలోచనా విధానంలో మార్పు కనిపిస్తోందని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ షరతులు లేని మద్దతు ఇవ్వాలని కోరారు. అయితే కాంగ్రెస్ ఇప్పటికే చట్టానికి మద్దతు తెలిపినందున, మళ్లీ మద్దతు ప్రకటించాల్సిన అవసరం లేదని రాహుల్ స్పష్టం చేశారు. రాజకీయ విమర్శలకు బదులుగా ఆమోదించిన చట్టాన్ని అమలు చేయడంపై కేంద్రం దృష్టి పెట్టాలని సూచించారు.

2023లో తీసుకొచ్చిన నారీ శక్తి వందన్ అధినియమ్ ద్వారా లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను కల్పించాలనే ఉద్దేశం ఉంది. దేశ రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని గణనీయంగా పెంచడం ఈ చట్టం ప్రధాన లక్ష్యం. అయితే ఈ రిజర్వేషన్ల అమలు డీలిమిటేషన్, తదుపరి జనాభా గణన ప్రక్రియతో ముడిపడి ఉండటంతో అమలు విజయంలో రాజకీయ వివాదం కొనసాగుతోంది. మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్‌తో అనుసంధానం చేయకుండా తక్షణమే అమలు చేయాలన్నది కాంగ్రెస్ సహా పలు ప్రతిపక్ష పార్టీల డిమాండ్‌గా ఉంది.

# ప్రాజెక్టుల భూసేకరణకు రూ.5 వేల కోట్లు

మొదటి తరువాయి

అటవీ, పర్యావరణ అనుమతులను అత్యంత ప్రాధాన్య అంశాలుగా తీసుకోవాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రాజెక్టుల వారీగా ఎన్ని నిధులు అవసరమో వెంటనే ప్రతిపాదనలు పంపాలనీ, అవసరమైన ఆర్థిక అనుమతులు, టోకెన్లు పొందడంలో జాప్యం చేయవద్దని సూచించారు. నాలుగున్నరేండ్లుగా నిలిచిపోయిన మిడ్‌మానేరు ఎడమ కాలువ మిగులు పనులను తక్షణమే పునఃప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. సవరించిన అంచనాలు సిద్ధం చేయడం, భూసేకరణ, టెండర్ల ప్రక్రియ, చట్టబద్ధ అనుమతుల సాధన... ఒకదాని తర్వాత మరొకటి కాకుండా సమాంతరంగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో ప్రతిపాదించిన లక్ష్మీనరసింహస్వామి పత్తిపాక రిజర్వాయర్‌ను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. ఈ పథకం ద్వారా కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు అందించడంతోపాటు కాకతీయ ప్రధాన కాలువలో డి-83 నుంచి డి-94 వరకు ఉన్న 2.40 లక్షల ఎకరాల



ఆయకట్టును స్థిరీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. లైడార్ సర్వే, డేటా ప్రాసెసింగ్ ఇప్పటికే పూర్తయ్యాయనీ, బోర్‌హోల్ డ్రిల్లింగ్, ట్రయల్ పిట్స్, జియోటెక్నికల్ పరిశోధనలు కొనసాగుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఆగస్టు నెలాఖరులోగా డీపీఆర్ సమర్పిస్తామని తెలిపారు. సమీక్షలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన ప్రతి సమస్యను 'యాక్షన్ పాయింట్'గా మార్చాలని, తదుపరి సమావేశం నాటికి వాటిపై తీసుకున్న చర్యల నివేదికను సమర్పించాలని అధికారులకు సూచించారు.

రోళ్లవాగు 96 శాతం పూర్తి.....

జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టు పనులు 96 శాతం పూర్తయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు. ప్రస్తుతం ఉన్న 0.250 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని 0.949 టీఎంసీలకు పెంచి, స్థానిక పరీవాహక ప్రాంతం నుంచి లభించే నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా చివరి ఆయకట్టులోని దాదాపు 15 వేల ఎకరాలకు సాగునీటి భరోసా కల్పించడం ప్రాజెక్టు లక్ష్యమని పేర్కొన్నారు. సర్‌ప్లస్ వీర్, హెడ్ స్లూయిస్‌లతో సహా ప్రధాన నిర్మాణాలు దాదాపుగా పూర్తయ్యాయని తెలిపారు. బండ్-2లో కొంత భాగం అటవీ భూమిలో ఉండటంతో మిగిలిన పనులు అటవీ అనుమతుల కోసం ఎదురుచూస్తున్నాయని చెప్పారు. సాంకేతికంగా ఉన్న సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి వెంటనే ప్రాజెక్టును వాడుకలో తీసుకు రావాలని అధికారులకు మంత్రి ఉత్తమ్ సూచించారు. సమీక్షలో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల కలెక్టర్లతో పాటు ఇంజినీర్-ఇన్-చీఫ్ ఓవి. రమేష్‌బాబు, నీటిపారుదల శాఖ జాయింట్ సెక్రెటరీ కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నించడమే కాదు.. పరిష్కారం చూడాలి

మొదటి తరువాయి

ప్రశ్నలు వేయాలని ముఖ్యంగా సమాధానాలు కనుగొనే ధైర్యం కలిగి ఉండాలని ఆయన కోరారు.

భవిష్యత్తు ప్రతి ఒక్కరికీ డిజిటల్ చిత్రం

మీ మనసు వెనుక ఏదో జరుగుతోంది. నేను బాబా బాగేశ్వర్ కాదు కానీ ప్రతి విద్యార్థి మనసులో ఆలోచనలు పరిగెత్తుతున్నాయి. ప్రతి ఒక్కరికీ భవిష్యత్తు గురించి ఒక చిత్రం ఉంది అని ప్రధానమంత్రి అన్నారు. ఓరియంటేషన్ నుంచి డిగ్రీ ప్రదానోత్సవం వరకు మీ ప్రయాణంలోని ప్రతి క్షణాన్ని గుర్తుంచుకోండి కొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోంది అని మోడీ చెప్పారు. ఈ రోజులను పూర్తిగా ఆస్వాదించాలని సలహా ఇచ్చారు. భవిష్యత్తులో బాధ్యతలు పెరిగినప్పుడు ఈ జ్ఞాపకాలు మీ ప్రయాణాన్ని గుర్తు చేస్తాయి, గతంలోకి తీసుకెళ్తాయి అని అన్నారు.

**మహిళల భాగస్వామ్యం పెరగాలి**

విద్యా రంగంలో మహిళల భాగస్వామ్యం పెరగాలని కూడా మోడీ నొక్కి చెప్పారు. టాపర్లలో ఎక్కువ మంది అమ్మాయిలు ఉండాలని ఆకాంక్షించారు. దేశంలో విద్య, పరిశోధన, ఆవిష్కరణల్లో యువతులు మరింత ముందుకు రావాలని పేర్కొన్నారు.

**నిత్యవిద్యార్థులే విజేతలు**

విద్యార్థులు ప్రవేశించే ప్రపంచం నిరంతరం మారుతుంది. సాంకేతికత, పరిశ్రమలు, వృత్తులు, ప్రపంచ శక్తి సమీకరణాలు కూడా వేగంగా మారుతున్నాయి. రాబోయే 20 లేదా 30 సంవత్సరాలు ఎలా ఉంటాయో ఖచ్చితంగా చెప్పలేం. కానీ ఒక నైపుణ్యం మాత్రం ముఖ్యమైనదిగా ఉంటుంది అదే నేర్చుకోవడం. నిరంతరం నేర్చుకునేవారు విజయం సాధిస్తారు అని గ్రాడ్యుయేట్లతో ప్రధాని అన్నారు. స్టార్టప్‌లకు అడ్డాగా ఐఐటీ ఢిల్లీ భారత్ స్టార్టప్ విప్లవంలో యువత పాత్రను మోడీ ఎత్తిచూపారు. మిలియన్ల యువత ఈ రంగంలో భారత్ స్టార్టప్ విప్లవాన్ని రూపొందించి బలోపేతం చేసిందని అన్నారు. ఐఐటీ ఢిల్లీ నుంచి అనేక మంది వ్యవస్థాపకులు వచ్చారని, ఒక సంస్థ సాధించిన విజయాలు దేశవ్యాప్తంగా నిర్మాణాత్మకమైన శక్తిని చూపిస్తున్నాయని చెప్పారు. ఒక సంస్థ ఇంత సాధిస్తే దేశవ్యాప్తంగా నిర్మాణమవుతున్న శక్తి ఎంత ఉంటుందో ఊహించండి అని అన్నారు.

**పరిశోధనలపై దృష్టి పెట్టాలి**

గ్రాడ్యుయేట్లు పరిశోధన రంగాన్ని అన్వేషించాలని ప్రధాని ఆకాంక్షించారు. ఇది మీ ముందున్న మరో పెద్ద అవకాశం అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి పరిశోధన ఫెలోషిప్, పరిశోధన అభివృద్ధి ఆవిష్కరణల పథకం, జాతీయ పరిశోధన పునాది వంటి కార్యక్రమాలను ఎత్తిచూపారు. ఇవి కొత్త ఆలోచనలకు మద్దతు ఇచ్చి భారత్‌లో పరిశోధనను బలోపేతం చేస్తాయి. పరిశోధనా రంగానికి లక్ష కోట్ల రూపాయిల వరకు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్ కార్యక్రమం ద్వారా ప్రతిష్టాత్మక ప్రపంచ పరిశోధన పత్రికలు చిన్న పట్టణాలతో సహా దేశవ్యాప్తంగా అదనపు రుసుము లేకుండా అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు.

**చిప్‌ల నుంచి షిప్‌ల వరకు**

కఠినమైన సవాళ్లను తీవ్రంగా తీసుకున్నప్పుడు ఏమి సాధ్యమవుతుందో చెప్పడానికి భారత్ సెమీకండక్టర్ ప్రయాణాన్ని ఉదాహరణగా ప్రధాని మోడీ చూపారు. ఈ రంగంలో అడుగులు వేసినప్పుడు దేశం సెమీకండక్టర్లు తయారు చేయగలదా అని ప్రశ్నలు వచ్చాయి. నేడు మొదటి సెమీకండక్టర్ యూనిట్ ఉత్పత్తి ప్రారంభం అయింది. చిప్‌ల నుంచి షిప్‌ల వరకు అన్నీ మీ చేతుల్లోనే తయారవుతాయని నేను గట్టిగా నమ్ముతున్నాను అని అన్నారు.

**సమస్యలకు భయపడవద్దు**

పెద్దగా కనిపించే సమస్యలకు భయపడకండి అని కూడా విద్యార్థులను మోడీ కోరారు. సవాళ్లు పెద్దగా అనిపించి నప్పుడు భయపడకండి. దాన్ని చిన్న భాగాలుగా విభజించండి అని చెప్పారు. గంటలు, రోజుల తరబడి సిమ్యులేషన్ల ద్వారా విద్యార్థులు పరిష్కారాలు కనుగొనే విధానాన్ని గుర్తు చేశారు. జీవితం సమస్యలు తెస్తుంది కానీ అప్రమత్తంగా ఉండి కొత్త పరిష్కారాలు వెతికేవారికి ఆ సమస్యలే అవకాశాలుగా మారతాయి అని అన్నారు.

దేశ ప్రయోజనానికి నిర్ణయాలు

రాబోయే 30 నుంచి 35 సంవత్సరాలు వికసిత్ భారత్ దిశగా భారత ప్రయాణాన్ని ప్రభావితం చేస్తాయని గ్రాడ్యుయేట్లకు గుర్తు చేశారు. కాబట్టి ఇది దేశానికి ఎలా ప్రయోజనం చేకూరుస్తుంది, ఏ జాతీయ అవసరాన్ని ఇది తీరుస్తుంది అనే దిశగా మీ నిర్ణయాలు ఉండాలని యువతకు ప్రధాని పిలుపునిచ్చారు.

# ఎస్ఐఆర్‌పై బీజేపీ శ్రేణులు దృష్టి సారించాలి

మొదటి తరువాయి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ ఐ ఆర్ రాష్ట్ర కన్వీనర్ వేముల అశోక్ అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) ఫేజ్-2 రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ముగియడానికి కేవలం మరొక రెండు రోజులు మాత్రమే (ఆగష్టు 10 వరకు) సమయం ఉన్నందున, ప్రతి నియోజకవర్గంలోనూ అర్హులైన ప్రతి ఒక్కరిచేత ఫారం-6 ద్వారా కొత్త ఓటు నమోదు వేగవంతంగా పూర్తి చేయించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ గడువు ముగిసిన తర్వాత కూడా రాబోయే రోజుల్లో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ల పరిశీలన, నకిలీ ఓట్ల గుర్తింపు, అభ్యంతరాల దాఖలు వంటి కీలకమైన అంశాలు ఉంటాయని రాంచందర్ రావు స్పష్టం చేశారు. ఫారం-7 (ఓట్ల తొలగింపు), ఫారం-8 (సవరణలు) సరైన రీతిలో దాఖలు చేయడం, నోటీసులకు తగిన ఆధారాలతో లీగల్‌గా సమాధానాలు ఇవ్వడం, పోలింగ్ బూత్ ల రేషనలైజేషన్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించడంపై బిఎల్ఎ-1లు (బి ఎల్ ఎ-1) లీగల్ టీమ్స్ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో ఓటర్ల జాబితా పారదర్శకత అత్యంత కీలకమని, ఆ బాధ్యతను బీజేపీ ప్రతినిధులు సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. దీంతో పాటుగా, పోలింగ్ బూత్ల రేషనలైజేషన్, గేటెడ్ కమ్యూనిటీలు మరియు ఓటర్లకు దగ్గర్లోని ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల కేటాయింపుపై కూడా బిఎల్ఎలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అలాగే రాబోయే హైదరాబాద్-రంగా రెడ్డి-మహబూబ్ నగర్, వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, నవంబర్ 1, 2025 కంటే ముందు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రుల డేటాను ఇప్పుడే సేకరించి, వారి ఓటు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఆర్ నిర్వాహకులు శశిధర్ రెడ్డి, ఆంటోనీ, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బిఎల్ఎ-1, బిఎల్ఎ-2 లు ముఖ్య నాయకులు పాల్గొన్నారు

# డిగ్రీతోనే ఉద్యోగం రాదు.. .

మొదటి తరువాయి

ఎంజీఏ తదితర వృత్తి విద్యా కోర్సుల నుంచి ఏటా 2 లక్షల మందికి పైగా గ్రాడ్యుయేట్లు బయటకు వస్తున్నారని శ్రీధర్‌బాబు తెలిపారు. వారికీ డిగ్రీలు, ప్రతిభ, ఎదగాలన్న బలమైన ఆకాంక్ష ఉన్నప్పటికీ ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌లో డిగ్రీ ఒక్కటే సరిపోదన్నారు. పరిశ్రమకు నైపుణ్యాలు, ప్రాక్టికల్ నాలెడ్జ్, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, కమ్యూనికేషన్, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మారే శక్తి, నిరంతరం నేర్చుకునే తత్వం అవసరం" అని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణలోని యువ జనాభాను అతిపెద్ద వనరుగా గుర్తించామని మంత్రి చెప్పారు. వీరంతా నైపుణ్యాలతో కూడిన మానవ వనరుగా మారినప్పుడే అది నిజమైన డెమోగ్రాఫిక్ డివిడెండ్‌గా మారుతుందన్నారు. మా లక్ష్యం కేవలం విద్య అందించడం కాదు.. ఉపాధి, పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి, ఆర్థిక అవకాశాలను అందిపుచ్చుకోవడానికి అవసరమైన విద్యను అందించడం" అని తెలిపారు. పాఠశాలల నాటి ఐటీఐ కోర్సులను ఆధునిక పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా మారుస్తున్నామని చెప్పారు. 65 ప్రభుత్వ ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీలు) అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. దశాబ్దాల క్రితం రూపొందించిన ఐటీఐ కోర్సులు అప్పటి పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఉండేవి. ఇప్పుడు తయారీ రంగంలో రోబోటిక్స్, ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, డిజిటల్ టెక్నాలజీలు అవసరం. మన ఐటీఐలు నిన్నటి పరిశ్రమ కోసం కాదు.. రేపటి ఫ్యాక్టరీల కోసం యువతను సిద్ధం చేయాలి" అని స్పష్టం చేశారు. టాటా సన్స్ సహకారంతో రూ. 2,400 కోట్లతో ఈ కేంద్రాలను భవిష్యత్తు పరిశ్రమ అవసరాలకు తగిన విధంగా తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటి పరిశ్రమలో మొదటి రోజు నుంచే పనిచేయగల నైపుణ్యం కలిగిన టెక్నీషియన్లను తయారు చేయడమే లక్ష్యమన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ దేశంలో నైపుణ్యాభివృద్ధికి కొత్త నమూనాగా నిలుస్తుందని మంత్రి చెప్పారు. విద్య ఉపాధికి దారితియ్యాలి. కోర్సుల రూపకల్పనలో పరిశ్రమకు మరింత బలమైన పాత్ర ఉండాలి. ప్రభుత్వం ఫెసిలిటేటర్‌గా ఉంటుంది.. పరిశ్రమలే నైపుణ్య వ్యవస్థలో కేంద్రంగా ఉండాలి" అని అన్నారు. ఆనంద్ మహీంద్రా ఛైర్మన్‌గా, వివిధ రంగాలకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్తల భాగస్వామ్యంతో యూనివర్సిటీ పనిచేస్తోందని తెలిపారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కోర్సులు, ప్రాక్టికల్ శిక్షణ, పరిశ్రమలో అనుభవం కల్పించడమే లక్ష్యమన్నారు.

# నేడు తెలుగు రాష్ట్రాలలో వర్షాలు



మొదటి తరువాయి

ఆంధ్రప్రదేశ్ -- యానాం వాతావరణ వివరాలు

తక్కువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ, వాయువ్య దిశల నుంచి గాలులు వీస్తుండటంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురిసే వాతావరణం నెలకొంది.

ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ -- యానాం

శనివారం అనేక ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులు సంభవించవచ్చు. గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశముంది. ఆది, సోమవారాల్లో ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి వర్షాలు, మెరుపులతో కూడిన జల్లులు పడే సూచనలున్నాయి. బలమైన గాలులు కొనసాగుతాయి.

దక్షిణ కోస్తాంధ్ర

శనివారం కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు పడవచ్చు. అక్కడక్కడ ఉరుములు, మెరుపులు వచ్చి, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముంది. ఆది, సోమవారాల్లో ఒకటి రెండు చోట్ల తేలికపాటి వర్షాలు లేదా జల్లులు కురిసే అవకాశం ఉంది.

రాయలసీమ

ఇక రాయలసీమ వ్యాప్తంగా వచ్చే రెండు రోజులు ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. అలాగే గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముంది.

తెలంగాణలో ఇలా

హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపిన వివరాల ప్రకారం.. రుతుపవన ద్రోణి ప్రస్తుతం అనూప్‌గఢ్, ఢిల్లీ, దిఘా మీదుగా ఆగ్నేయ దిశగా తూర్పు-మధ్య బంగాళాఖాతం వైపు కొనసాగుతోంది. వచ్చే మూడు రోజులు తెలంగాణలో అక్కడక్కడ తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. రాష్ట్రానికి ఎలాంటి భారీ వర్ష హెచ్చరికలు లేవని, సాధారణ మోస్తరు వర్షాలు మాత్రమే కురుస్తాయని అధికారులు స్పష్టం చేశారు. వాతావరణంలో మార్పుల దృష్ట్యా వర్షాలు కురిసే సమయంలో సముద్ర తీర ప్రాంతాల ప్రజలు, ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# నేడు నర్సంపేటకు కేసీఆర్

ఉద్యమంలో ముందుండి పోరాడారు. తన ముఖ్య అనుచరుడుగా కొనసాగిన సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, కష్టకాలంలో ఉన్న వారికి భరోసా ఇవ్వనున్నారు. పెద్ది కుటుంబానికి ఇప్పటికే రూ.2. 25 కోట్ల ఆర్థిక సహాయం ప్రకటించిన విషయం తెలిసిందే.

# ఎస్‌టిపిపి జైపూర్‌లో అత్యవసర సంసిద్ధతకు నిదర్శనంగా బహుళ-శాఖల మాక్ డ్రిల్

**-"ఎటువంటి సవాల్‌నైనా ఎదుర్కొనేందుకు సిద్ధం" అని చాటిన భద్రతా బలగాలు.**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు08 నవ సంఘర్షణ

దేశ ప్రధాన విద్యుత్ కేంద్రాలలో ఒకటైన సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్, జైపూర్ లో భద్రతకు ఎలాంటి రాజీ లేదని నిరూపిస్తూ శుక్రవారం వార్షిక బహుళ-శాఖల మాక్ డ్రిల్ ను అత్యంత క్రమశిక్షణతో, విజయవంతంగా నిర్వహించారు. సీఐఎస్ఎఫ్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ విన్యాసానికి ఎస్‌టిపిపి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్. చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరై భద్రతా బలగాల సామర్థ్యాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు.

పరిపాలనా భవనంలో యాజమాన్య అధికారులను బందీలుగా తీసుకున్న అత్యవసర పరిస్థితి అనే అత్యంత సున్నితమైన ఘటనను కల్పితంగా రూపొందించి, అలాంటి సమయంలో భద్రతా, రెస్క్యూ, వైద్య విభాగాలు ఎంత వేగంగా, ఎంత సమన్వయంతో స్పందిస్తాయో ప్రదర్శించారు. సెకన్ల వ్యవధిలో అలర్ట్ అయిన బలగాలు, పకడ్బందీ ప్రణాళికతో ఆపరేషన్ పూర్తి చేయడం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఈడి సిహెచ్. చిరంజీవి మాట్లాడుతూ, ఇలాంటి మాక్



డ్రిల్లులు కేవలం ప్రదర్శన కోసం కాదని, అత్యవసర సమయంలో ప్రాణాలను కాపాడే ప్రాక్టీస్ అని అన్నారు. వివిధ శాఖల మధ్య సమన్వయం, సమాచార మార్పిడి, తక్షణ స్పందనే మన బలం. ఎటువంటి పరిస్థితినైనా ధైర్యంగా ఎదుర్కొనేందుకు ఎస్‌టిపిపి కుటుంబం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంది అని స్పష్టం చేశారు. ఈ విన్యాసంలో సీఐఎస్ఎఫ్, తెలంగాణ పోలీసు శాఖ, ఎస్‌సీసీఎల్ రెస్క్యూ టీమ్, ఎస్‌డీఆర్ఎఫ్, ఎస్‌టిపిపి ఫైర్ & సేఫ్టీ విభాగం తమ నైపుణ్యాన్ని చూపించారు. ఉమ్మడి ఆపరేషన్, రేడియో కమ్యూనికేషన్, రెస్క్యూ ఆపరేషన్లు అన్నీ క్షణాల్లో పూర్తి చేసి అసలైన అత్యవసర పరిస్థితికి మనం ఎంత సిద్ధంగా ఉన్నామో చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ కమాండెంట్ చంచల్ సర్కార్, ఏజీఎం వి.వి. సుధాకర్ రెడ్డి, చీఫ్ ఆఫ్ ఓ & ఎం కె. శివ ప్రసాద్, జైపూర్ ఎస్.ఐ. భూమేష్, సేఫ్టీ ఆఫీసర్ పులి సురేష్ తో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాములోరి అభిషేకంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి

**-ఆలయం ప్రధాన అర్చకులు అనంతచార్యులు..**



మందమర్రి ఆగస్టు08 నవ సంఘర్షణ

శ్రీ సీతా రామచంద్ర స్వామికి 1000 కళాశాలతో జరగనున్న అభిషేకంలో మందమర్రి పట్టణం లోని ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని వెంకటేశ్వర ఆలయం ప్రధాన అర్చకులు అనంత చార్యులు కోరారు. శనివారం పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి 70వ తిరునక్షత్రం సందర్భంగా మహిళలు కోలాటాలు, భజనలతో కలశ యాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత యాంత్రిక సమాజంలో జూ మానవీయ విలువలను ప్రేమ ఆప్యాయతలను పెంపొందించేందుకు సఖ్యత, గౌరవం, స్నేహశీ, కుటుంబాలలో, సమాజంలో పెంపొందించాలని కోరారు. వీటన్నింటికీ ఆదర్శంగా ఉండే శ్రీరామచంద్ర స్వామిని మన హృదయంలో నింపుకుంటూ ఆయన హృదయంలో మనమందరం చేరి ఉండాలని ఆశిస్తూ పట్టణ వ్యాప్తంగా శ్రీరామృదయం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు పాల్గొని భక్తి భావాన్ని చాటాలని కోరారు. అనంతరం కలశపూజ నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు . ఈ కార్యక్రమంలో వ ఆనరసింహచార్యులు, శ్రీకరాచారి కృష్ణ కాంత్ చార్యులు ,భాస్కర చార్యులు, సాయి ప్రసాద్ చారి, హరిప్రసాద్ చారి, నిర్వాహకులు ఆకుదారి లక్ష్మీనారాయణ ,రామటేంకి దుర్గరాజు ,పైడిమల్ల అరుణ్ కుమార్, రాజన్న, సది, కుమార్, భక్తులు, తదితరులు, పాల్గొన్నారు.

# రైతు మేళా-2026ను విజయవంతం చేయాలి

**- జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్ర**



హనుమకొండ, ఆగస్టు08 నవ సంఘర్షణ

హనుమకొండ జిల్లా కాళోజీ కళాక్షేత్రంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న జిల్లా స్థాయి రైతు మేళా-2026ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి విజయ చంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నూతన సాగు పద్ధతులు, ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, అధిక దిగుబడులు సాధించే విధానాలపై అవగాహన కల్పించేందుకు రైతు మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలు, సాగులో ఎదురవుతున్న సవాళ్లపై నిపుణులతో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రైతు మేళాలో మట్టి పరీక్షలు, సాయిల్ ప్రొఫైలింగ్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోని వివిధ కార్యక్రమాలు, ఎరువులు--విత్తనాల వినియోగం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన అధికారులు, శాస్త్రవేత్తలు, నిపుణులు పాల్గొని రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తారని చెప్పారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలపై రైతులకు సమగ్ర సమాచారం అందించడంతో పాటు, ఆధునిక సాంకేతికతను వ్యవసాయంలో వినియోగించుకునేలా ప్రోత్సహించడమే రైతు మేళా ప్రధాన ఉద్దేశ్యమని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. జిల్లాలోని రైతులు పెద్ద సంఖ్యలో రైతు మేళాకు హాజరై, వ్యవసాయ నిపుణులు మరియు అధికారుల సూచనలు, సలహాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్ర కోరారు.

# నూతన సీఐ రాజా బోయిన రవికి ఘన సన్మానం

**-శాలువా, పుష్పగుచ్ఛంతో మర్యాదపూర్వకంగా అభినందించిన ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు.**




జహీరాబాద్ ఆగస్టు08 నవ సంఘర్షణ

జహీరాబాద్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ రాజా బోయిన రవిని ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ రాజా బోయిన రవికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చల్లా శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు చ. వీరన్న, సయ్యద్ ముబీన్, ఆల్గోలు పాల్గొన్నారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎస్సీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ బక్కన్న, ఆల్గోలు బీఆర్ఎస్ పార్టీ మాజీ వైస్ ప్రెసిడెంట్ అనిల్ కుమార్, జహీరాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ మాజీ జనరల్ సెక్రటరీ పసుపుల ప్రభాకర్ పాల్గొని సీఐ రాజా బోయిన రవికి అభినందనలు తెలిపారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు అతీఖ్, సంతోష్, బాలరాజ్, కిష్టపేర్, కృష్ణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతన సీఐ రాజా బోయిన రవి ఆధ్వర్యంలో జహీరాబాద్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు మరింత ప్రాధాన్యత లభిస్తుందని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు.

# గోశాల దళితులకే వర్తిస్తుందా

**-పరకాలలో రోడ్లపై పశువుల స్వైర విహారం తక్షణమే చర్యలు తీసుకోవాలి**

**-బిఆర్ఎస్ కౌన్సిలర్ దుబాసి వెంకట్ స్వామి**




పరకాల ఆగస్టు08 నవ సంఘర్షణ

హనుమకొండ జిల్లా పరకాల పట్టణ కేంద్రంలోని బస్టాండ్ ఆనుకొని ఉన్న ప్రధాన చౌరస్తాలో పశువులు నడిరోడ్డుపై విచ్చలవిడిగా తిరుగుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో పశువుల గుంపుల కారణంగా తరచూ ట్రాఫిక్ అంతరాయం కలగడమే కాకుండా, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని పట్టణ బిఆర్ఎస్ కౌన్సిలర్ దుబాసి వెంకట్ స్వామి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై అధికారులు స్పందించి కేవలం కొన్ని పశువులను మాత్రమే రోడ్ల నుంచి తరలించి చేతులు దులుపుకున్నారని, మిగతా పశువుల నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, రోడ్లపై సంచరిస్తున్న పశువుల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని మరియు పట్టణ ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా తక్షణ భద్రతా చర్యలు చేపట్టాలని వెంకట్ స్వామి డిమాండ్ చేశారు. దళితుల పశువులు మాత్రమే తరలించారు పశువులను కూడా తరలించి భద్రత కల్పించాలని వెంకట్ స్వామి డిమాండ్ చేశారు

# ఫీజుల పారదర్శకతతో పాటు నియంత్రణ చట్టం తీసుకురావాలి

**-బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జేకే డిమాండ్**



ఆగస్టు08 నవ సంఘర్షణ జమ్మికుంట ఆగస్టు 8

ప్రైవేట్ పాఠశాలలు తమ ఫీజుల వివరాలను తప్పనిసరిగా బహిరంగంగా ప్రకటించేలా తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం స్వాగతించదగినదని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జేకే అన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల సమస్యలపై బీఆర్ఎస్వీ ఎన్నో ఏళ్లుగా చేస్తున్న ప్రజాస్వామ్య పోరాటాల ఫలితంగానే ఫీజుల పారదర్శకత దిశగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. అయితే ఫీజుల వివరాలను ప్రకటించడం మాత్రమే సరిపోదని, ప్రైవేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచకుండా ప్రభుత్వం కఠినమైన నియంత్రణ చర్యలు చేపట్టాలని జేకే డిమాండ్ చేశారు. తెలంగాణ అసెంబ్లీలో ప్రత్యేకంగా "ఫీజుల నియంత్రణ మరియు క్రమబద్ధీకరణ బిల్లు" ప్రవేశపెట్టి, చట్టబద్ధమైన నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. "విద్య హక్కు.. వ్యాపారం కాదు" అని పేర్కొన్న జేకే, విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులపై భరించలేని స్థాయిలో ఫీజుల భారం మోపడం అన్యాయమన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల వసూళ్లలో పూర్తి పారదర్శకత ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు న్యాయం జరిగే వరకు, అధిక ఫీజుల భారం తగ్గే వరకు బీఆర్ఎస్వీ పోరాటం కొనసాగుతుందని జేకే స్పష్టం చేశారు.

# హుజురాబాద్ బీసీ గురుకులలో ఘనంగా బోనాల వేడుకలు





సామాజిక తెలంగాణ ఆగస్టు08 నవ సంఘర్షణ

హుజురాబాద్ పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలికల పాఠశాల లో తెలంగాణ రాష్ట్ర పండుగ బోనాల వేడుకను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థినిలు సాంప్రదాయ దుస్తుల్లో బోనాలు పెట్టుకుని అమ్మవారికి పూజలు చేశారు. పాఠశాల ఆవరణం మొత్తం భక్తిశ్రద్ధలతో జాతర వాతావరణంతో నిండిపోయింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ టి .శారద మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పండుగైన బోనాలను పాఠశాల ఆవరణంలో నిర్వహించి అమ్మవారికి బోనం సమర్పించామని పసుపు కుంకుమ వేపాకులతో అలంకరించిన బోనాలను ఎత్తుకొని ఉపాధ్యాయులు, విద్యార్థినిలు చేసిన ఊరేగింపు ప్రత్యేకంగా ఉందని తెలంగాణ సంస్కృతిలో ఆడబిడ్డలకు ఉన్న ప్రాధాన్యతను చాటుతూ ఈ వేడుకను పాఠశాలలో నిర్వహించడం తెలంగాణ సంస్కృతిని, సాంప్రదాయాలను విద్యార్థులకు తెలిసే విధంగా నిర్వహించామని ప్రిన్సిపల్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ టి.శారద, ఏటీపీ నాగరాణి, బి డబ్ల్యు నీరజ, కే రజిత, పి రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.




# కనపడుటలేదు!



నీట్ లీకేజీ తర్వాత దేశవ్యాప్తంగా పెల్లుబికిన నిరసనల సమయంలో అమిత్‌షా సభలోనే ఉన్నాడు. కేంద్రం బిల్లులు ప్రవేశపెట్టినప్పుడూ ఉన్నాడు. వాటిని మందబలంతో ఆమోదించు కున్నప్పుడు ఉన్నాడు. ప్రభుత్వ నిర్ణయాల్ని సమర్థిం చాల్సినప్పుడు కూడా ఉన్నాడు. కానీ, ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌పై వివరణ ఇవ్వాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేసినప్పుడు మాత్రం లేడు! విద్యార్థులపై పోలీసుల దాష్టీకాన్ని ప్రశ్నించినప్పుడు అక్కడ లేడు! హోం మంత్రి పదవి అంటే కేవలం అధికారాన్ని వినియోగిండానికేనా? 'జంతర్‌మంతర్' నిరసనలకు జవాబుదారీతనం అవసరం లేదా? ఈ ప్రశ్నే ఇప్పుడు దేశ మంతా వినిపిస్తోంది. దీనికితోడు సభను హుందాగా నడిపిస్తూ సభ్యులకు దిశానిర్దేశం చేయాల్సిన ప్రధాని కూడా పత్తకు లేకుండా పోయాడు. పార్లమెంట్ అంటే కేవలం తమకు నచ్చిన బిల్లులు ఆమోదించు కోవడ మేనా? ప్రజా సమస్యలపై చర్చ ఉండక్కర్లేదా? విద్యార్థులకు సంబం ధించి కీలకమైన ప్రశ్నల్ని ప్రతిపక్షాలు లేవ నెత్తితే వాటికి జవాబు చెపాల్సిన బాధ్యుడు చట్టసభలో లేకపోవడం, సభను అవమానిం చడమే కాదు, ప్రజల విశ్వాసాన్ని కూడా వమ్ము చేసినట్టే. జూలై 20న ప్రారంభమైన పార్లమెంట్ శీతకాల సమావేశాలు ఈ నెల 13 వరకు జరగనున్నాయి. మొత్తం ఇరవై ఐదు రోజుల వ్యవధిలో ఇప్పటివరకు పంతొమ్మిది సమావే శాలు జరగ్గా అమిత్‌షా మెజార్టీ రోజులు గైర్హాజరైనట్టు తెలుస్తోంది. చట్టసభ ప్రజాస్వా మ్యానికి గుండెకాయ లాంటిది, అక్కడ చట్టాలు చేయడమే కాదు, ప్రజల తరపున ప్రతిపక్షాలు అడిగే ప్రశ్నలకు బాధ్యతగా సమాధానం చెప్పాలి. కానీ, ఆ బాధ్యత నుంచి అధికారపక్షం వైదొలుగుతుండటం శోచనీయం. అందుకే సభలో అడిగిన ప్రశ్నలకు సమాధానాలు రాకపోవడంతో అవే ప్రశ్నల ప్లకార్డులతో ప్రతిపక్ష సభ్యులు పార్లమెంట్ ముందు నిరసనలు చేపట్టడం అధికార పార్టీ అహంకారాన్ని తెలియజేస్తోంది. వారడుగుతున్న ప్రశ్న ఒక్కటే- ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జికి కారణాలు వెల్లడించాలి, అమిత్‌షా సభలో ప్రకటన చేయాలి. ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నల్లో అసంబద్ధత ఏముంది? విద్యార్థులపై లాఠీచార్జి ఎందుకు జరిగింది? శాంతియుతంగా నిరసన తెలిపిన యువతపై బలప్రయోగానికి ఆదే శాలు ఎవరిచ్చారు? వారి గొంతు నొక్కే కుట్రలకు ఎవరు పాల్పడ్డారు? కాక్రోచ్ ఉద్యమం ఎందుకు పుట్టింది? ఈ అసంతృప్తికి కారణమెవరు? ఇవన్నీ దేశ ప్రజల తరపున అడిగిన ప్రశ్నలే. ఢిల్లీ పోలీసు వ్యవస్థ కేంద్ర హోం మంత్రిత్వశాఖ పరిధిలోనే ఉన్నప్పుడు జరిగిన చర్యపై వివరణివ్వడం హోంమంత్రి రాజ్యాంగ బద్ధమైన బాధ్యత. కానీ ఆ బాధ్యతను విస్మరించి సభను పట్టించుకోకపోవడం వెనుక ఉద్దేశం స్పష్టం! 'మేం ఎవరికి జవాబుదారీ కాదు. మమ్మల్ని ఎవరూ ప్రశ్నించొద్దు' అన్న ధోరణితో ఉంటే అది ప్రజాస్వామ్యం ఎందుకవుతుంది, కచ్చితంగా నియంతృత్వ పాలనకే దారితీస్తుంది. జెన్-జీ యువత ఉద్యమాలను కేవలం రాజకీయ కోణంలో చూడలేం. ఉపాధి, విద్య, పరీక్షల నిర్వహణ, అవకాశాల కొరత వంటి అంశాలనేకం. ఆ ఆవేదనకు రూపమే ఈ ఉద్యమాలు. 'కాక్రోచ్' వంటి ప్రతీకలు కూడా అదే నిరసనకు చిహ్నాలు. ప్రభుత్వం వీటి వెనుక ఉన్న సందేశాన్ని అర్థం చేసుకోవాల్సింది పోయి, ఉద్యమాలనే అణచివేయచూడటం సమస్యను మరింత పెంచడమే. ఇక్కడ మరో ఆశ్చర్యకరమైన విషయం. ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులపై కేసులు నమోదు చేయకుండా 'క్షమిస్తున్నామ'ని ప్రకటించడం. అసలు క్షమించాల్సింది ఎవరు? రాజ్యాంగం ఇచ్చిన హక్కుతో నిరసన తెలిపిన విద్యార్థులా? లేక వారిపై లాఠీలు కురిపించిన ప్రభుత్వమా? ప్రజాస్వామ్యంలో ప్రజలే యజమానులు. ప్రభుత్వం సేవకుడు. సేవకుడు యజమానిని 'క్షమిస్తున్నాం' అని చెప్పే స్థితి రావడం ప్రజాస్వామ్య విలువలకే విరుద్ధం. నిజంగా క్షమాపణ చెప్పాల్సింది ప్రభుత్వం. చర్చలు, వివరణలు, జవాబుదారీతనం లేకుండా ప్రజాస్వామ్యం బలపడదు. హోంమంత్రి అమిత్ షా ఈ అంశంపై సభలో నిలబడి వివరణ ఇవ్వాలి. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జి ఎందుకు చేయాల్సి వచ్చింది? దానికి బాధ్యులెవరు? ఎందుకు శాంతియుత నిరసనను బలప్రయోగంతో ఎదుర్కొన్నారు? అన్న ప్రశ్నలకు దేశం సమాధానం కోరుతోంది. మౌనం సమాధానం కాదు. ప్రజాస్వామ్యంలో హోంమంత్రి పదవి అధికారానికి కాదు, జవాబుదారీతనానికి ప్రతీక. బిల్లులు పెట్టినప్పుడు 'ఉన్నాడు'... అధికారానికి అవసరమైనప్పుడు 'ఉన్నాడు'... కానీ ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి వచ్చినప్పుడు 'లేడు' అనే భావన ప్రజల్లో ఏర్పడితే, అది ఒక వ్యక్తిపై విమర్శ మాత్రమే కాదు, పాలనా విధానంపై అవిశ్వాసానికి సంకేతం. పార్లమెంట్‌ను గౌరవించడం అంటే ప్రతిపక్షాన్ని వినడం, ప్రజల ప్రశ్నలకు సమాధానమివ్వడం, తప్పు జరిగితే క్షమాపణ చెప్పడం. అదే ప్రజాస్వామ్య స్ఫూర్తి. ఆ స్ఫూర్తి కొరవడుతుందంటే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతున్నట్టే లెక్క.

# బొద్దింకల వేటలో రాహుల్ !





బొద్దింకలను బుట్టలో వేసుకోవడమెలా? ఇప్పుడు ఇదే ఆలోచనతో కాంగ్రెస్ అప్రకటిత అగ్రనేత రాహుల్ గాంధీ తన ప్రయత్నంలో తను ఉన్నారని చెప్పాలి. బొద్దింకలకు మద్దతుగా ఆయన కార్యక్రమాలు చేస్తున్నారు. నిజానికి ఈ బొద్దింకల వెనక కాంగ్రెస్ పార్టీ కూడా ఉందన్న టాక్ ఒకటి రాజధానిలో చక్కర్లు కొడుతోంది. మోడీని పడగొట్టాలంటే రాహుల్‌తో కావడం లేదు. ఆయన జనం దగ్గర పెద్దగా ప్రతిష్టను సంపాదించలేకపోయారు. యూపిఎ ప్రభుత్వం ఓడినప్పటి నుంచి నానా కష్టాలు పడ్డా లాభం లేకుండా పోతోంది. రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, రిజర్వేషన్లు ఎత్తేస్తారని బాగా ప్రచారం చేయడంతో గత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కొంత పుంజుకుంది. అయితే ఇది రాహుల్ నాయకత్వాన్ని పుంజుకునేంతగా మాత్రం కాదు. ఇప్పుడు ఇటీవల దేశంలో ఓ కుదుపు కుదిపిన బొదింకలను బుట్టలో వేసుకునే ప్రయత్నం లో ఉన్నారు. వారి ఆందోళనకు మద్దతుగా పార్లమెంట్‌లో పోరాడుతున్నారు. అలాగే వారితో కలసి పని చేసేందుకు ఉత్సాహ పడుతున్నారు. ఇటీవల ఉద్యమంలో పాల్గొన్న కొందరు విద్యార్థులతో కలసి మీడియా ముందుకు వచ్చారు. ప్రయాగ్ రాజ్‌లో జెన్‌జీలతో కలసి ఆందోళనకు పిలుపునిచ్చారు. ఇవన్నీ కూడా ఓ క్రమపద్దతిలో మోడీని ఢీకొనేందుకు చేస్తున్న ప్రయత్నాలుగా గుర్తించాలి. తాజాగా రైతులు కూడా మళ్లీ రోడ్డెక్కబోతున్నారు. ఈ ఇద్దరిని కలిపితే వాలిలా తన బలం కూడా పెరుగుతుందని భావిస్తున్నట్లుగా ఉంది. ఇకపోతే ఇటీవల రాహుల్ తన ఆహార్యాన్ని కూడా మార్చారు. జీన్స్, టి షర్ట్‌తోనే ఎక్కువగా కనిపిస్తున్నారు. ఖద్దరు బట్టలను ఉత్తికి అవతల పడేశారు. యువతరం మనసులో ఏముందో గుర్తించి అందుకు అనుగుణంగా పార్టీ విధానాలు, నినాదాలను సవరించుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని భావిస్తున్నారు. తమిళనాడు ఎన్నికల ఫలితందీనిని రుజువు చేస్తోంది. ఎన్నికలు రాగానే సరికొత్త సంక్షేమ పథకాలను ప్రకటించి ఓటర్లకు డబ్బు పంచితే చాలన్న భావన ఇప్పటివరకు ఉండేది. తమిళనాడు ఎన్నికలు ఇందుకు భిన్నంగా ఫలితాలను ఇచ్చాయి. టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ డబ్బు పంచకుండాఇ, పెద్దగా ప్రకటనలు చేయకుండా ద్రవిడ పార్టీలను దెబ్బతీసారు. తమిళనాడులో యువతను ఆకట్టుకోవడం ద్వారా విజయ్ అధికారంలోకి వచ్చారు. విజయ్ కూడా ద్రవిడ పార్టీలతో పోటీపడి సంక్షేమ పథకాలు ప్రకటించినా ప్రజలు వాటి గురించి పట్టించుకోలేదు. నిజానికి నేటి తరానికి చెందిన యువత కేవలం సంక్షేమ పథకాలను మాత్రమే కోరుకోవడం లేదు. ప్రభుత్వంలో జవాబుదారీతనం కోరుకుంటున్నారు. ఢిల్లీ నుంచి గల్లీ దాకా వివిధ స్థాయిల్లో జవాబుదారీతనం ఇప్పుడు లోపించింది. అధికార దుర్వినియోగం పెచ్చరిల్లింది. పాలకులు విలాసాలు పెరిగాయి. ప్రభుత్వాలలో ఏ స్థాయిలో కూడా జవాబుదారీతనం కనిపించడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ ఒక్క ఫైలు కూడా దానంతట అది కదిలే పరిస్థితి లేదు. లంచం ఇవ్వనిదే కాగితం కదలని పరిస్థితి. ఈ కారణంగానే ఈ దేశ యువతలో ఆశలు, ఆకాంక్షలతో పాటు నిరాశా నిస్పృహలు చోటుచేసు కుంటున్నాయి. అందుకే అవకాశం రాగానే మార్పును ఆహ్వానిస్తున్నారు. పరీక్షా పేపర్ల లీక్ విషయంలో మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యంగానే వ్యవహరించింది. తాము చేసే పనులే మంచివనే పరిస్థితికి మోడీ వచ్చేశారు. అందుకే ఆయన ప్రజల గుండెచప్పుడు వినలేకపోతున్నారు. జెన్‌జీ లంతా బొద్దింకల రూపంలో నిరసనలు తెలపడంతో కొంత సర్దుకున్నా, పూర్తిగా సర్దుకునేందుకు సిద్దం కావడం లేదు. దీన్ని అవకాశంగా తీసుకుని రాహుల్ దూకుడు ప్రదర్శిస్తున్నారు. అందుకే దేశంలోని రాజకీయ పార్టీలు బొద్దింకల పేరు ఎత్తగానే భయపడుతున్నాయి. నిన్నటి తరం ఆలోచనలతో, పాత చింతకాయ పచ్చడి విధానాలతో నడుస్తున్న పార్టీలకు ఎన్నికలలో నవతరం నుంచి ప్రతిఘటన ఎదురవుతోంది. యువతరంలో ఆశలు,ఆకాంక్షలు పెరుగుతున్న సమయంలోనే నిరాశా నిస్పృహలు కూడా వారిని కమ్మేస్తున్నాయి. బొద్దింకల ఢిల్లీ ఆందోళన ఇందుకు తాజా ఉదాహరణ. ఈ బొద్దింకలను పట్టేస్తే..మనకు తిరుగు లేదని అందరూ ఆలోచన చేస్తున్నారు. రాహుల్ గాంధీ ఓ అడుగు ముందుకు వేసి వారికి మద్దతుగా పోరాట పంథా అవలంబిస్తున్నారు. పార్లమెంట్ లోపలా, బయటా ఇప్పుడు, విద్యార్థులు, యువత గురించి గట్టిగా మాట్లాడు తున్నారు. యవతరంతో కనెక్ట్ కాని పార్టీలు మెల్లగా తెరమరుగవుతాయని గుర్తించారు. ప్రధాని మోదీ కూడా సామాజిక మాధ్యమాల్లో యువతరం వెలిబుచ్చుతున్న అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని తదనుగుణంగా వ్యూహాలు రూపొందించుకోవాలని పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భూవత్ కూడా ఇదే విషయాన్ని ప్రకటించారు. స్వాతంత్ర్య సంగ్రామాన్ని ముందుండి నడిపించిన కాంగ్రెస్ పార్టీ... ఆ తర్వాత దేశాన్ని సుదీర్ఘ కాలం పరిపాలించింది. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నుంచి లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్‌సింగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రధానమంత్రులుగా పనిచేశారు. కాంగ్రెస్ నాయకుల పెడ ధోరణులు కారణంగా నేటి తరానికి దూరం అయ్యారు. పార్టీని ఎప్పటికప్పుడు యువతతో కనెక్ట్ చేసుకునే పనిని కాంగ్రెస్ నాయకులు చేయలేదు. విధానాలను, ఆలోచనలను సవరించుకొని నవీకరించుకోవడంలేదు. డెబ్బై అయిదేళ్లు పైబడిన ప్రధాని నరేంద్ర మోదీ ఈ దేశం యువతతో కనెక్ట్ అవుతుండగా... వయసులో చిన్నవాడైన రాహుల్‌గాంధీ యువతను ఆకట్టుకోలేకపోయారు. ఆలస్యంగా అయినా ఇప్పుడు రాహుల్ యువత గురించి ఆలోచి స్తున్నారు. అయితే బొద్దింకల పార్టీ రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించింది. కేవలం ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తామని అభిజిత్ దీప్కే ప్రకటించారు. ఈ క్రమంలో రాహుల్ బుట్టలో పడతారా లేక సొంతగా తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తారా అన్నది ముమ్ముందు తేలనుంది. ఓ వైపు రాజ్యాంగం బుక్, మరోవైపు బొద్దింకల ఎజెండాతో ముందుకు సాగడం ద్వారా జాతీయ స్థాయిలో విజయం సాధించి అధికారం చేపట్టాలన్న లక్ష్యంతో రాహుల్ సాగుతున్నారు.

# యుద్ధాలు ఎంత మధురమైనవో!

మన చుట్టూ ఎడతెరిపిలేకుండా సాగుతున్న యుద్ధాలను చూసి విసుగేస్తున్నదా? భయం కూడా కలుగుతున్నదా? అవును మరి, మనం సామాన్యులం గనుక. కాని కొందరికి ప్రతి యుద్ధమూ ఒక పండగే. వాటి వల్ల మనుషులుగా మనకు, ప్రపంచానికి కలిగే నష్టాలు ఎంతటివో, వారికి ఒనగూరే లాభాలు అంతకన్న అనేక రెట్లు గనుక. ప్రస్తుతం జరుగుతున్న ఉక్రెయిన్ రష్యా, ఇరాన్ అమెరికా, ఇజ్రాయెల్, పాలస్తీనాఇజ్రాయెల్, అమెరికా అనే మూడు యుద్ధాలను గమనించినా చాలు ఈ రెండు విషయాలు బోధపడతాయి. వాస్తవానికి యుద్ధాలన్నవి ఎప్పుడూ ఉన్నా అందువల్ల కలిగే తీవ్రాతి తీవ్రమైన ప్రాణనష్టాలు, ఆస్తి నష్టాలు ఆధునిక కాలంలో అందరికీ మొదటి ప్రపంచ యుద్ధం (191418)లో తెలిసివచ్చాయి. చనిపోయిన వారు, గాయపడిన వారు కలిపి సువారు 4 కోట్లన్నది అంచనా. ఆస్తినష్టాలకు లెక్కలు లేవు. యుద్ధ అనంతర కాలంలోనూ నష్టాలు పలు రూపాలలో కొనసాగాయి. అది గమనించిన దేశాలు, స్వయంగా యుద్ధాలు చేసిన వాటితోసహా, జ్ఞానోదయమైనట్లు నటించాయి. ఇక ప్రపంచంలో శాంతిభద్రతలు నెలకొల్పుతామంటూ లీగ్ ఆఫ్ నేషన్స్ అనే సంస్థను 1920లో నెలకొల్పాయి. అది చూసి ప్రపంచం సంతోషించింది. కాని ఆ సంతోషం ఎక్కువకాలం నిలవలేదు. అప్పటినుంచి 20ఏళ్లు అయినా గడవకుండా 1939లో రెండవ ప్రపంచ యుద్ధం మొదలైంది. 1945 వరకు సాగింది. ఈసారి మృతులు, క్షతగాత్రులు పోయిన మారుకన్న రెట్టింపు అయి 8 కోట్లకు చేరారు. ఇతర నష్టాలు ఊహించటం కూడా సాధ్యం కాదు. మొదటి ప్రపంచ యుద్ధ ప్రభావంతో ఆర్థిక వ్యవస్థలు కుప్పగూలి ఆర్థిక మాంద్యం (192021) ఏర్పడగా, అది తర్వాత (1929)లో మరింత తీవ్రమైంది. రెండవ ప్రపంచ యుద్ధానంతరమైతే యూరప్ తిరిగి కోలుకునేందుకు 1520 సంవత్సరాలు పట్టింది. మొదటి యుద్ధం తర్వాత వలెనే రెండవ యుద్ధం తర్వాత కూడా ఆ పెద్దలకు మరోమారు జ్ఞానోదయమైంది. ప్రపంచంలో శాంతి, భద్రతల కోసం ఈసారి లీగ్ ఆఫ్ నేషన్స్ కన్న పటిష్టమైన రీతిలో ఐక్యరాజ్య సమితిని 1945 నెలకొల్పుతున్నామన్నారు. ఆ సంస్థకు అనుబంధంగా భద్రతా సమితి, అంతర్జాతీయ న్యాయస్థానం, వివిధ అంతర్జాతీయ చట్టాల వంటివి వచ్చాయి. అది చూసి ప్రపంచం, కనీసం ఈసారైనా మంచి జరగవచ్చునని ఆశలు పెట్టుకుంది. ఈ సంతోషమూ ఎక్కువ కాలం నిలవలేదు. అప్పటినుంచి ఇప్పటివరకు జరిగిన, ఇంకా జరుగుతున్న చిన్నా పెద్దా యుద్ధాలకు లెక్క లేదు. నష్టాల మాట చెప్పనక్కరలేదు. ఒకసారి భవిష్యత్తు వైపు చూస్తే కొన్ని కొత్త యుద్ధాలు ఇప్పటికే ముంచుకొస్తున్నాయి. మరికొన్ని ఎపుడైనా ముంచుకు రావచ్చుననిపిస్తున్నది. ఎందుకిదంతా? కారణాలేమిటి? బాధ్యులెవరు? ఇదంతా ఇట్లా జరుగుతున్నదంటే ఎవరి లాభం కోసం? నష్టాలు భరించేదెవరు? యుద్ధాలను కోరుకునే దెవరు? వద్దనుకునే దెవరు? ఎవరి కోరికలు నెరవేరే సూచనలు కనిపిస్తున్నాయి? ఈ సమస్యకు అంతిమంగా పరిష్కారమేమిటి? పైన ప్రస్తావించిన మూడు ప్రస్తుత యుద్ధాలకు మళ్లీ వద్దాము. మొదటిది రష్యా ఉక్రెయిన్. ఇది ఉక్రెయిన్‌కు చెందిన క్రిమియాపై రష్యా 2014లో దాడి చేసి ఆక్రమించుకోవటంతో మొదలైంది. ఆ వెంటనే ఉక్రెయిన్ తూర్పు ప్రాంతంలోని డోన్‌బాస్‌లో గల రష్యన్ మెజారిటీ ప్రజలు అక్కడి ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలుపెట్టారు. అప్పటి నుంచి సమస్య చిలికిచిలికి గాలివానల అయి, 2022 నుంచి పూర్తిస్థాయి యుద్ధంగా మారింది. ఈ నాలుగేళ్లలో డోన్ బాస్‌లోని సుమారు 80 శాతం భూభాగాన్ని రష్యా ఆక్రమించింది. ఇతరత్రా యుద్ధం నిరంతరం సాగుతున్నది. ఇంతకూ ఎందుకీ యుద్ధం అన్నది ప్రశ్న. ఈ విషయం పదే పదే చర్చకు వస్తున్నదే అయినందున కారణాలు అందరికీ తెలిసినవే. అయినప్పటికీ సందర్భం వచ్చింది గనుక ఒకసారి క్లుప్తంగా చెప్పుకోవాలి. ఒకప్పటి సోవియెట్ యూనియన్ 1991లో పతనమైనాక, దాని నాయకత్వాన ఉండిన వార్సా సైనిక కూటమి కూడా రద్దయింది. అప్పటి ద్విధ్రువ ప్రపంచంలో తమకు పోటీగా ఉండిన ఈ రెండూ లేకుండా పోయినపుడు, అమెరికా నాయకత్వాన గల నాటో సైనిక కూటమితో ఇక అవసరం ఉండకూడదు. కాని ఆ కూటమిని కొనసాగించారు. అంతేకాదు. నాటోను ఇక విస్తరించబోమంటూ రష్యాకు ఇచ్చిన హామీకి విరుద్ధంగా ఆ సైనిక సంస్థలో మరిన్ని యూరోపియన్ దేశాలను చేర్చుకుంటూ రష్యా సరిహద్దుల వైపు తీసుకుపోవటం మొదలుపెట్టారు. ఆ క్రమంలో ఉక్రెయిన్ చివరి సరిహద్దుగా మారింది. సమస్య అట్లా మొదలైంది. కనీసం ఉక్రెయిన్‌ను నాటోలో చేర్చరాదని రష్యా పదేపదే కోరింది. అయినా అమెరికా, యూరప్‌లు పెడచెవినపెట్టి అటువంటి హామీ ఇచ్చేందుకు తిరస్కరించాయి. దానితో రష్యా తన ఆత్మరక్షణ కోసం రెండు విధాలైన చర్యలు ఆరంభించింది. ఒకటి, రష్యన్ భాషీయులు ఆధిక్యతలోగల క్రిమియాను ఆక్రమించటం. ఆ పని త్వరగానే జరిగిపోయింది. ఆ వెనుక, రష్యన్ భాషీయులే మెజారిటీ అయిన డోన్ బాస్‌ను స్వాధీనపరచుకునే ప్రయత్నం. ఈ రెండు జరిగినట్లయితే, యూరప్‌కు తమకు మధ్య ఈ రెండు ప్రాంతాలు రక్షణగోడగా నిలువగలవన్నది వారి వ్యూహం. అదట్లా ఉంచితే, వార్సా కూటమి, సోవియెట్ యూనియన్ రెండూ రద్దయి తమకిక ముప్పు ఏమీ లేనపుడు నాటోను విస్తరించటంలో అమెరికా, యూరప్‌ల ఉద్దేశమేమిటన్నది ప్రశ్న. వారు ఆ పని చేయనట్లయితే ఈ రష్యా ఉక్రెయిన్ యుద్ధం అసలు జరిగేది కాదు గదా? ఇందులో రహస్యమేమీ లేదు. మొత్తం ప్రపంచంలోనే అతి పెద్దది



అయిన రష్యాలో సహజ వనరులు అపారం. కనుక, సోవియెట్ యూనియన్‌ను విచ్ఛిన్నం చేసినట్లే రష్యాను కూడా చేసినట్లయితే అవన్నీ తమ వశం కావటంతోపాటు ఆ దేశం ఇక ఎప్పటికీ తమకు పోటీ అయేట్లు ఎదగలేదన్నది అమెరికా, యూరప్‌ల అంచనా అయింది. ఆ విధంగా ఈ యుద్ధం ఎంతో మధురంగా మారింది. ఉక్రెయిన్‌ను పాచికగా ముందుకు జరిపి, వారికి ఆయుధ సరఫరాలు చేస్తూ ఎడతెగని యుద్ధం నడిపిస్తున్నారు. ఆ దేశానికి ఆయుధాలు అమ్మి, అప్పులిచ్చి తమ కంపెనీలు ఈలోగానే లాభపడుతున్నాయి. ఇది ఎంతకాలం ఇట్లా సాగేదీ ఎవరూ చెప్పలేరు. రెండవ యుద్ధం పాలస్తీనా, గాజా కూడా ఇదే విధంగా మధురమైనది. తొలుత 1947 లో జరిగిన ఐక్య రాజ్య సమితి తీర్మానం ప్రకారం పాలస్తీనా, ఇజ్రాయెల్ రెండు స్వతంత్ర దేశాలుగా ఏర్పడాలి. కాని అప్పటినుంచి నేటి వరకు ఇజ్రాయెల్, అమెరికా, యూరప్‌లు దానిని భంగపరుస్తూ రావటం తెలిసిందే. ఆ తీర్మానం అమలవుతే తమ గ్రేటర్ ఇజ్రాయెల్ లక్షం నెరవేరదనేది ఇజ్రాయెల్ ఆలోచన కాగా, ఇంధన వనరులు సమృద్ధిగాగల ఆ ప్రాంతంలో తమకు ఆటంకాలు ఏర్పడతాయని, భౌగోళిక వ్యూహాలకు సమస్యలు ఎదురవుతాయన్నది అమెరికా కూటమి సందేహం. కనుక అందరూ కలిసి గత ఎనిమిది దశాబ్దాలుగా చేస్తున్నదేమిటో కనిపిస్తున్నదే. ఇది ఇటీవల 2023లో హమాస్ మిలిటెంట్లు ఇజ్రాయెల్‌పై జరిపిన ఆకస్మిక దాడితో మొదలైంది కాదు. ఇది ఒక కొత్త దశ మాత్రమే. ఈ దశలో రెండు కొత్త పరిస్థితులను కూడా మనం చూస్తున్నాము. గాజాను పూర్తిగా ఆక్రమించి అక్కడి ప్రజలను వెళ్లగొట్టి రిసార్టులు నిర్మిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ బాహాటంగానే ప్రకటిస్తున్నారు. ఆ ప్రకారం ఒకవైపు ఇజ్రాయెల్ సైన్యం పాలస్తీనా ప్రజలపై మారణకాండను నిరంతరం సాగిస్తుండగా, మరొక వైపు అమెరికన్ అధ్యక్షుడు 'బోర్డ్ ఆఫ్ పీస్' అంటూ ఒక కపటపు సంస్థను తన అధ్యక్షతన ఏర్పాటు చేసి, ఇజ్రాయెల్‌కు సహకరించే చర్యలు సాగిస్తున్నారు. గాజా పరిస్థితి ఇది కాగా, పాలస్తీనాలో రెండవ భాగమైన వెస్ట్ బ్యాంక్ అసలు పాలస్తీనాలో భాగమే కాదని ప్రకటించిన నెతన్యాహూ, ఆ ప్రాంతాన్ని రకరకాలుగా ఆక్రమించటం నిరాఘాటంగా సాగుతున్నది. ఆ విధంగా ఈ రెండవ యుద్ధం కూడా మధురమైన లక్షాలతో మధురంగా మారింది. పరిస్థితులు ఇదే విధంగా కొనసాగితే పాలస్తీనా ప్రత్యేక దేశమన్న ఐక్యరాజ్య సమితి తీర్మానం ఎక్కువ కాలం పట్టకుండానే నిరర్థకం కాగలదు. ఆ మాట పాశ్చాత్య ప్రపంచంలో ఇప్పటికే మొదలైంది కూడా. ఈలోగా అమెరికన్, యూరోపియన్ కంపెనీలను నుంచి మొదలుకొని భారతీయ కంపెనీల వరకు ఇజ్రాయెల్‌కు ఆయుధాలనమ్మి మధురమైన లాభాలు సంపాదిస్తున్నాయి.

# ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా దళిత న్యాయవాదులకు అవకాశం కల్పించాలి

**- ఎస్.రంజిత్ కుమార్**

**-జిల్లా ఉపసర్పంచ్ ల సంఘం మాజీ అధ్యక్షుడు**



జోగులాంబ గద్వాల జిల్లా ( ఆగస్టు08 నవ సంఘర్షణ

ప్రస్తుతం గద్వాల జిల్లా కోర్టులో ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా ఎన్నిక జరుగుతున్న నేపథ్యంలో జిల్లా కోర్టులో సీనియర్ న్యాయవాదులలో కొనసాగుతున్న ఒకరిని ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా దళిత న్యాయవాదిని నియమించాలని జిల్లా ఉపసర్పంచ్ ల సంఘం మాజీ అధ్యక్షులు ఎస్. రంజిత్ కుమార్ కోరారు.ముఖ్యంగా గత 50 సంవత్సరాలనుండి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల కాలం నుండి నేడు సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం లో సైతం నేటికీ గద్వాల జిల్లా కోర్టులో జిల్లా కేంద్రం లో దళితులకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమించకపోవడం అంటే అవమానంగానే భావిస్తున్నామని ఆయన అన్నారు.ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలో సీనియర్ న్యాయవాదుల లో ఒకరిని ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా ఎన్నిక చేసి దళిత సామాజిక వర్గం పట్ల వున్న లౌకికవాదాన్ని చాటుకోవాలని కోరారు.

# ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్ జన్మదిన వేడుకలు

**-ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసిన మున్సిపల్ చైర్మన్, పట్టణ అధ్యక్షుడు నరేష్ గౌడ్.**



జహీరాబాద్ ఆగస్టు08 నవ సంఘర్షణ

జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, పట్టణ అధ్యక్షుడు నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్ కు చైర్మన్ మహమ్మద్ యూనుస్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేయాలని, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకల్లో భాగంగా మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ స్థానిక ఆసుపత్రిని సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. రోగుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రోగులతో ఆప్యాయంగా మాట్లాడి వారికి ధైర్యం కల్పించారు. వేగంగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తమ ఇళ్లకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పట్టణ అధ్యక్షుడు నరేష్ గౌడ్, వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి,మున్సిపల్ కౌన్సిలర్లు జహంగీర్, కవిత అశోక్, ఖాజామియా, జమీలుద్దీన్, అక్రమ్, సీనియర్ నాయకులు కండెం నరసింహులు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వడ్లూరి రామస్వామి దశదినకర్మకు హాజరైన మాదిగ మహా శక్తి రాష్ట్ర

**-నాయకులు ఆసంపల్లి శ్రీనివాస్ (వాసు)**



ఆగస్టు నవ సంఘర్షణ

దుబ్బపల్లె గ్రామం మంథని నియోజక వర్గానికి చెందిన వడ్లూరి రామస్వామి స్వర్గస్తులైన సందర్భంగా వారి దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ పులేందర్

మాజీ కార్పొరేటర్ రామగుండం మడిపెల్లి మల్లేష్ సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ఛైర్మెన్,అక్కపాక సంపత్ ,రామమూర్తి తో కలిసి వారికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేయడం జరిగింది

# ఘనంగా పండగ సాయన్న జయంతి ఉత్సవాలు

**-పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్ సిద్దు రావణ్.**



జహీరాబాద్ ఆగస్టు08 నవ సంఘర్షణ

చరిత్రపుటల్లో స్వర్ణాఅక్షరాలతో లిఖించదగిన మహావీరుడు పండుగ సాయన్న చరిత్ర మరచిన ఓ వీరుడి జన్మదిన పండగ జహీరాబాద పట్టణంలో పండగ సాయన్న 135వ జయంతిని పురస్కరించుకొని జహీరాబాద్ బస్టాండ్ నుండి ప్రధాన కూడలిని దాటుతూ అంబేద్కర్ విగ్రహానికి వరకు బైక్ ర్యాలీలతో చేరుకోవడం జరిగింది మొదటగా అంబేద్కర్ గారికి పూలమాలలు వేసి పండుగ సాయన్న ముదిరాజ్ కి చిత్రపటానికి పూలమాలలువేయడం జరిగింది ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్ సిద్దు రావణ్ పండుగ సాయన్న జయంతిని పురస్కరించుకొని మాట్లాడుతూ రాజ్యం భ్రష్టమై అవినీతి దోపిడి అన్యాయం పెరిగినప్పుడు ప్రజల్లో నుండి వీరులు ఉద్భవిస్తారు అలా అన్యాయాన్ని ఎదిరించి అణగారిన వర్గాలకై గొంతు ఎత్తిన మహా పురుషుడు పండుగ సాయన్న .భారత స్వాతంత్రోద్యమ కాలంలో నిజాం రాజ్యంలో జరిగిన తిరుగుబాటు ఉద్యమాలలో రజాకార్ల రాజ్యం కొనసాగుతూ ఉండే అప్పట్లో రజాకార్లు భూస్వాములను గుప్పెట్లో పెట్టుకొని పరిపాలన కొనసాగించారు వారి పరిపాలనకు వ్యతిరేకంగా రజాకార్ల మీద ఉక్కు పాదం మోపిన వీరుడు పండుగ సాయన్న . పెత్తందారులను కొట్టి పేదలకు పెట్టాడని బందిపోటు అన్నారు రజాకార్లకు తిరుగుబాటు చేశాడని తల నరికేశారు రాజ్యాంగంలోని హక్కుల కోసం ప్రశ్నిస్తే దేశద్రోహులు తీవ్రవాదులుగా ముద్ర వేశారు వ్యవస్థను ప్రశ్నిస్తే మరణమే శాసనం అనే సందేశాన్ని ఈ దేశంలోనే పాలక వ్యవస్థలు ఇస్తున్నాయి . కానీ వీరులకు మరణం ఉండదు. విప్లవాలకు అంతం ఉండదు అని మరోసారి నిరూపించిన పండుగ సాయన్న ముదిరాజ్ గారికి జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రభుత్వం అధికారికంగా పండగ సాయన్న ముదిరాజ్ జయంతిని నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్ సిద్దు రావణ్ డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పలువురు విద్యావేత్తలు ఉద్యమకారులు కార్యకర్తలతో పాటుభీమ్ ఆర్మీ నియోజకవర్గ నాయకులు మండల నాయకులు శంకర్ నరసింహ గోపాల్ బాలరాజు విజయ్ రాములు మహమ్మద్ అలీం, సలీం నర్సింలు ముదిరాజ్, వెంకన్న ముదిరాజ్ ప్రేమ కుమార్ అనంతరం సదానంద్ రామచందర్ ధనరాజ్ అనంతరం బక్కన్న బుద్ధిష్ట్ రాహుల్ ,బీసీ సంఘ నాయకులు నర్సింలు ముదిరాజ్, సిద్ధార్థ్ అడ్వకేట్ రాకేష్ ముదిరాజ్ శ్రీకాంత్ ముదిరాజ్ వెంకన్న ముదిరాజ్ తదితరాలు పాల్గొన్నారు

# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్ పెట్టుబడిదారులు, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి

**-ఆగస్టు 10 జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి**

**-సీఐటీయూ జిల్లా కోశాధికారి కడారి నర్సమ్మ**



కొల్చారం, ఆగస్టు08 నవ సంఘర్షణ

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్ పెట్టుబడిదారులు, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని, ఆగస్టు 10న నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి కడారి నర్సమ్మ పిలుపునిచ్చారు. సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ఆటో ప్రచార యాత్ర సందర్భంగా కొల్చారం మండల కేంద్రంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా నర్సమ్మ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేసిందని విమర్శించారు. ఈ కోడ్‌ల వల్ల కార్మికుల పనిగంటలు పెరగడంతో పాటు, సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కులు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్మికులపై పని భారం పెంచే ఈ నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, 2025 విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని, విత్తన చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆయా చట్టాల వల్ల ప్రజలకు ఉచిత విద్యుత్ దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఉపాధి హామీ కూలీలకు సంవత్సరానికి 200 రోజుల పని కల్పించడంతో పాటు రోజువారీ వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2005లో యూపీఏ-కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో వామపక్షాల పోరాట ఫలితంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమల్లోకి వచ్చిందని గుర్తుచేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పేరును మార్చడంతో పాటు రాష్ట్రాల వాటాను 10 శాతం నుంచి 40 శాతానికి పెంచి రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం మోపేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకంలోని 100 రోజుల పనిని ఎత్తివేసే కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ నెల 10న సోమవారం నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమానికి అన్ని రంగాల కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల తరఫున నర్సమ్మ కోరారు. ఇకార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డీ. మల్లేశం, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి శేఖర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధిగా నారోజు కుమారస్వామి నియామకం



మర్రిగూడ,ఆగస్టు08 నవ సంఘర్షణ

మర్రిగూడ మండలం యరగండ్లపల్లి గ్రామానికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు నారోజు కుమారస్వామిని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రోజున పార్టీ అధిష్టానం నియామక ఉత్తర్వులను అధికారికంగా ప్రకటించింది.ఈ సందర్భంగా శనివారం రోజు మర్రిగూడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కుమారస్వామి మాట్లాడారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ కుమార్, నల్గొండ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు పిట్టల శ్రీనివాస్ నియోజకవర్గ నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాకు దక్కిన ఈ పదవి క్షేత్రస్థాయిలో రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసే ప్రతి బీజేపీ కార్యకర్త ఉమ్మడి శ్రమ ఫలితమే అని కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను, ముఖ్యంగా వెనుకబడిన వర్గాల కోసం చేపడుతున్న కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటీకి తీసుకెళ్తానని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి, బీసీల హక్కుల సాధనకు పోరాడుతూనే పార్టీ బలోపేతానికి, విస్తరణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ధీమా వ్యక్తం చేశారు.?ఈ సమావేశంలో కుమారస్వామి నియామకం పట్ల స్థానిక నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మామిడి పరుశురాం, ఓబీసీ మోర్చా మాజీ మండల అధ్యక్షులు పగిళ్ల లింగస్వామి, బూత్ అధ్యక్షులు ఆమంచల దామోదర్, పంగ యాదయ్యల, బీజేపీ నాయకులు పంగ లక్ష్మణ్, పంగ శేఖర్, దండేటి మహేష్, అయితగోని శ్రీరామ్, ఈరగోని శివ తదితరులు పాల్గొన్నారు.

# 7 నెలల గర్భిణి భార్యను హత్య చేసిన ఆర్మీ జవాన్..

**ప్రమాదంగా చిత్రీకరించే యత్నం**



**న్యూఢిల్లీ, ఆగస్టు 8. నవ సంఘర్షణ**
మహారాష్ట్రలో ఒక ఆర్మీ జవాన్ ఘాతుకానికి పాల్పడ్డాడు. ఏడు నెలల గర్భిణి అయిన భార్యను గొంతునులిమి హత్య చేశాడు. అనంతరం ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించాడు. కానీ, చివరకు నేరం బయటపడి పోలీసులకు చిక్కాడు. ఈ ఘటన మహారాష్ట్రలోని వాసిం జిల్లాలో గురువారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధ్యానేశ్వర్ మాడ్నే (28) అనే వ్యక్తి ఆర్మీలోని మరాఠా బెటాలియన్‌లో పని చేస్తున్నాడు. అతడి భార్య దీపాలి ఏడు నెలల గర్భిణి. ఇటీవల అతడు సెలవుపై ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో భార్య దీపాలితో గురువారం మధ్యాహ్నం గొడవ జరిగింది. దీంతో భార్య గొంతు నులిమి హత్యకు యత్నించాడు.అప్పటికే ఆమె స్పృహ తప్పి పడిపోయి, కొన ఊపిరితో ఉంది. అయితే, ఆమెను వెంటనే ఒక ప్రైవేటు అంబులెన్స్‌లో స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. ఆమె పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్యులు ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. దీంతో ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ప్రమాదవశాత్తు తన భార్య పడిపోయిందని వైద్యులతో చెప్పాడు. కానీ, వైద్యులకు అతడిపై అనుమానం వచ్చింది. ఎందుకంటే ఆమె మెడపై గాయాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గొంతునులిమినట్లుగా గాయాలున్నాయి. దీంతో వైద్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈలోపు మధ్యాహ్నం 3.00 గంటలకు దీపాలి కుటుంబ సభ్యులకు ధ్యానేశ్వర్ సమాచారం అందించాడు. దీపాలి ఇంట్లో పడిపోయిందని, ఆమె పరిస్థితి విషమంగా ఉందని చెప్పాడు. మధ్యప్రదేశ్‌లో ఉంటున్న వారు సాయంత్రం ఆస్పత్రికి వచ్చి చూసేసరికి దీపాలి మరణించింది. అప్పటికే ఈ ఘటనపై వైద్యుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు ధ్యానేశ్వర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై మహిళ కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ధ్యానేశ్వర్‌కు వేరే మహిళతో వివాహేతర సంబంధం ఉందని, ఈ విషయంలో భార్యాభర్తల మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోందని చెప్పారు. అతడి వివాహేతర సంబంధం కారణంగా తమ సోదరి దీపాలిని అతడు తీవ్రంగా వేధించేవాడని ఆమె సోదరుడు రాహుల్ చెప్పాడు. దీంతో కొద్ది రోజుల క్రితం ఇరు కుటుంబాల వాళ్లు కూర్చుని, అతడికి నచ్చజెప్పినట్లు వెల్లడించారు. అయితే, ఆ తర్వాత నుంచి మళ్లీ దీపాలిని వేధించేవాడని పోలీసులకు తెలిపారు. ఈ అంశంపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు.. భర్త ధ్యానేశ్వర్‌ను అరెస్టు చేశారు. అతడితోపాటు అత్తామామలపై కూడా హత్య కేసు నమోదు చేశామమని పోలీసులు తెలిపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని వివరించారు.

# వింగ్ కమాండర్‌పై హనీట్రాప్

**పాకిస్థాన్ మహిళకు రక్షణ సమాచారం లీక్**



**న్యూఢిల్లీ, ఆగస్టు 8. నవ సంఘర్షణ**
పాకిస్థాన్ ఏజెంట్స్ భారత వైమానికదళానికి చెందిన ఐఏఎఫ్ అధికారి (వింగ్ కమాండర్)కు వలపు వల వేశారు. సోషల్‌మీడియా చాటింగ్‌తో పరిచయమైన ఓ మహిళ వల పన్ని.. అతడి నుంచి కీలకమైన రక్షణ సమాచారాన్ని రాబట్టినట్టు ఢిల్లీ పోలీసులు చెప్తున్నారు. మే 31 రాత్రి అరెస్టయిన సదరు వింగ్ కమాండ్‌ర్‌పై అధికార రహస్యాల చట్టం కింద కేసు నమోదుచేసినట్టు ఢిల్లీ పోలీసులు శనివారం మీడియాకు తెలిపారు. సదరు మహిళ మొదట అతడి నమ్మకాన్ని సంపాదించి, ఆ తర్వాత సైనిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం రాబట్టడం ప్రారంభించింది. సైనిక యూనిట్ల కదలికలు, ఇతర సున్నితమైన సమాచారాన్ని ఆ మహిళతో వింగ్ కమాండర్ పంచుకున్నారని ఆరోపణలు ఉన్నాయి.

# భారత్‌పై 100% సుంకాలు?

**బిల్లుకు అమెరికన్ సెనేట్ ఆమోదం**




**వాషింగ్టన్, ఆగస్టు 8. నవ సంఘర్షణ**
రష్యా నుంచి చమురు, గ్యాస్‌ను ప్రధానంగా కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారాన్ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కల్పించే ఒక బిల్లును అమెరికా సెనేట్ శుక్రవారం ఆమోదించింది. దీంతో కొత్త వాణిజ్య ఆంక్షల ప్రమాదం ఉన్న దేశాల జాబితాలో భారత్ కూడా చేరింది. రష్యా, ఇరాన్‌లపై ఆంక్షలు విధించే లిండ్స్ ఓ గ్రాహమ్ చట్టం-2026ను సెనేట్ 86-11 ఓట్ల తేడాతో ఆమోదించింది. ఇప్పుడు ఈ బిల్లు ప్రతినిధుల సభకు(హౌస్ ఆఫ్ రిప్రెంజెటిటివ్స్) వెళుతుంది. ముందుగా ఈ బిల్లు చట్టంగా మారి ఆ తర్వాత వాటిని విధించాలా వద్దా అనే విషయంలో ట్రంప్‌కు నిర్ణయాధికారం ఉంటుంది. ఈ బిల్లు అమెరికాకు జరిగే భారతీయ ఎగుమతులపై మరిన్ని సుంకాలు విధించే ముప్పును కలిగిస్తున్నది. రష్యా నుండి చమురు, సహజ వాయువును అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్న చైనా, భారత్, అజర్‌బైజాన్, హంగేరీ, స్లోవేకియా వస్తువులపై 100 శాతం వరకు సంకాలు విధించే అవకాశం ఏర్పడింది.

# సీఎం విజయ్‌కు షాక్..

**డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష సమావేశానికి 37 మంది ఎంపీల డుమ్మా**



**న్యూఢీల్లి నవ సంఘర్షణ**
తమిళనాడు సీఎం విజయ్‌కు ఆ రాష్ట్ర ఎంపీలు పెద్ద షాక్ ఇచ్చారు. డీ లిమిటేషన్ బిల్లుపై చెన్నైలో విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి 20 మంది ఎంపీలు మాత్రమే హాజరైనట్లు తెలుస్తోంది. అంటే, 37 మంది ఎంపీలు మీటింగ్‌కు హాజరుకాలేదు. పార్లమెంట్‌లో తమిళనాడుకు 57 మంది ఎంపీలున్నారు. వీరిలో 39 మంది లోక్‌సభ ఎంపీలు, 18 మంది రాజ్యసభ ఎంపీలు. తమిళనాడు ప్రతిపక్ష డీఎంకే, ఏఐఏడీఎంకే నుంచి ఒక్క ఎంపీ కూడా ఈ సమావేశానికి హాజరు కాలేదు.పార్లమెంట్‌లో కేంద్రం డీ లిమిటేషన్ బిల్లును సోమవారం ప్రవేశపెట్టబోతున్న సంగతి తెలిసిందే. ఈ బిల్లును వ్యతిరేకిస్తామని తమిళనాడు అధికార టీవీకే ఇంతకుముందే ప్రకటించింది. అలాగే, తాము కూడా ఈ బిల్లును వ్యతిరేకిస్తామని డీఎంకే కూడా శనివారం ప్రకటించింది. ఇతర తమిళ పార్టీలు కూడా దాదాపు ఇదే వైఖరితో ఉన్నాయి. ఏఐఏడీఎంకే నిర్ణయం ఏంటో తెలియాల్సి ఉంది. ఈ బిల్లుపై చర్చించాలని సీఎం విజయ్.. తమిళనాడు ఎంపీలో శనివారం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి టీవీకే కూటమి పార్టీ అయిన కాంగ్రెస్‌తోపాటు చిన్న పార్టీలే హాజరయ్యారు. 12 మంది కాంగ్రెస్ ఎంపీలు, వీసీకే నుంచి ఇద్దరు, సీపీఐ నుంచి ఇద్దరు, సీపీఎం నుంచి ఇద్దరు, ఎండీఎంకే నుంచి ఒకరు, ఐయూఎంఎల్ నుంచి ఒకరు మాత్రమే సమావేశానికి వచ్చారు. వీరంతా టీవీకేతో తమిళనాడులో పొత్తులో ఉన్నవారే. ఇక, ప్రతిపక్ష డీఎంకే.. ఈ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు తెలిపింది. కావేరి అంశం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే విజయ్ ఈ సమావేశం ఏర్పాటు చేశాడని ఆరోపించింది. పీఎంకే, ఎంఎన్ఎం, డీఎండీకే పార్టీలు కూడా విజయ్ నిర్వహించిన సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించాయి. పార్లమెంట్‌లో డీఎంకే పార్టీకి 30 మంది ఎంపీలున్నారు. తమిళనాడు నుంచి అత్యధికమంది ఎంపీలున్న పార్టీ కూడా ఇదే. అలాగే, ఏఐఏడీఎంకేకు నలుగురు, పీఎంకే పార్టీకి ఒక ఎంపీ, ఎంఎన్ఎం పార్టీకి ఒక ఎంపీ, డీఎండీకేకు ఒక ఎంపీ ఉన్నారు.

# ఉక్రేనియన్ మహిళ రికార్డు బ్రేక్

**ఉత్తరాఖండ్ మహిళకు 8 అడుగుల 10 అంగుళాల జుట్టు..**





**న్యూఢీల్లి ఆగస్టు 8. నవ సంఘర్షణ**
ఉత్తరాఖండ్‌కు చెందిన ఒక మహిళ అత్యంత పొడవైన జుట్టుతో ప్రపంచ రికార్డు నెలకొల్పింది. ఒక ఉక్రేనియన్ మహిళ రికార్డును బ్రేక్ చేసి, తాజాగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. దీనికి సంబంధించిన వివరాల్ని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ అధికారికంగా వెల్లడించింది. వారి సోషల్ మీడియా వివరాల ప్రకారం.. ఉత్తరాఖండ్‌కు చెందిన రేణు ధరియాల్ అనే మహిళ ప్రస్తుతం 271.50 సెంటీమీటర్లు (8 అడుగుల 10 అంగుళాలు) పొడవున్న జుట్టు కలిగి ఉంది.గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రకారం ప్రస్తుతం భూమిపై జీవించి ఉన్న మహిళల్లో అత్యంత పొడవైన జుట్టు కలిగి ఉన్నది ఆమెకే. ఇంతకుముందు ఇదే అంశంలో ఉక్రెయిన్‌కు చెందిన అలియా నసిరోవా అనే మహిళ రికార్డును రేణు బ్రేక్ చేసింది. అలియాకు 257.33 సెంటీమీటర్లు (8 అడుగుల 5.3 అంగుళాలు) పొడవున్న జుట్టు ఉండేది. రేణు ధరియాలు ఇప్పుడు ఆమెకంటే 14 సెంటీమీటర్లు ఎక్కువ జుట్టు కలిగి, ఆమె రికార్డు బ్రేక్ చేసింది. అయితే, మరో ప్రపంచ రికార్డును కొద్దిలో మిస్సైంది. రాబర్ట్ వాడ్లోవ్ అనే మహిళకు 272 సెంటీమీటర్ల జుట్టు ఉండేది. ఆమెకంటే అర సెంటీమీటర్ మాత్రమే రేణుకు జుట్టు తక్కువగా ఉంది. మరికొద్ది రోజుల్లో రేణు ఈ రికార్డ్ కూడా బ్రేక్ చేయొచ్చు. ఇక, రేణ ధరియాల్ 2015 నుంచి జుట్టు పెంచుతోంది. ఇందుకోసం భారతీయ సహజ, సంప్రదాయ పద్ధతుల్ని మాత్రమే అనుసరించినట్లు చెప్పింది. కెమికల్స్‌తో తయారయ్యే కమర్షియల్ ప్రొడక్ట్స్‌ను చాలా తక్కువగా వాడుతానని చెప్పింది. ఇంట్లోనే తయారు చేసుకునే ఆయిల్స్, షాంపూలు వాడుతానంది. చాలా పొడవుంది కాబట్టి.. తన జుట్టును శుభ్రం చేసుకునేందుకు చాలా ఓపిక అవసరం అంటోంది. ఇందుకోసం గంటల సమయాన్ని కూడా వెచ్చిస్తానని తెలిపింది. ఇక, తను యూట్యూబ్‌తోపాటు సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటుంది. తన హెయిర్ కేర్‌కు సంబంధించిన వివరాల్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో వెల్లడిస్తుంది. చాలా ఓపికతో, ఎంతో సమయం వెచ్చించడం వల్ల ఈ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ దక్కినట్లు రేణు వెల్లడించింది.

# రాహుల్‌గాంధీ వైఖరి మారినట్లుంది..



**న్యూఢీల్లి ఆగస్టు 8. నవ సంఘర్షణ**
మహిళల స్వేచ్ఛపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. గురువారం నిర్వహించిన 'ఆస్క్ మీ ఎనీథింగ్ ' కార్యక్రమంలో రాహుల్ మాట్లాడుతూ.. మహిళలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పగలిగే పరిస్థితి ఉండాలని అన్నారు. శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్ లో ఈ అంశంపై మరింత వివరంగా పేర్కొన్నారు. దీనిపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పందించారు.మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ ఇప్పుడు బేషరతుగా మద్దతు ఇవ్వాలని కోరారు. మహిళల్లో ఉన్న శక్తి పూర్తిస్థాయిలో బయటకు రావడం లేదని రాహుల్ అన్నారు. మహిళలు తమకు నచ్చిన విషయాలపై స్వేచ్ఛగా మాట్లాడాలని చెప్పారు. ఇళ్లలో, కుటుంబాల్లో, సమాజంలో తమ అభిప్రాయాలను చెప్పే అవకాశం ఉండాలని పేర్కొన్నారు. కుటుంబసభ్యులు అంగీకరించని విషయాలపై కూడా మహిళలు తమ అభిప్రాయం చెప్పగలగాలని అన్నారు. పురుషుల ఆధిపత్యం నుంచి మహిళలకు కొంత స్వేచ్ఛ అవసరమని చెప్పారు. అప్పుడే దేశం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. రాహుల్ వ్యాఖ్యలు కాంగ్రెస్ వైఖరిలో మార్పునకు సంకేతంగా కనిపిస్తున్నాయని రిజిజు అన్నారు. 'మహిళల విషయంలో రాహుల్‌గాంధీ వైఖరిలో మార్పు కనిపిస్తోంది. ఇప్పుడు కాంగ్రెస్ మహిళా రిజర్వేషన్ బిల్లుకు బేషరతుగా మద్దతు ఇస్తుందని ఆశిస్తున్నా' అని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును 2023లో పార్లమెంట్ ఆమోదించింది. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించేలా ఈ చట్టం ఉంది. అయితే దీని అమలుకు నియోజకవర్గాల పునర్విభజన అవసరం. ఈ నేపథ్యంలో డీలిమిటేషన్ బిల్లును తిరిగి తీసుకొచ్చేందుకు విపక్షాల మద్దతును ప్రభుత్వం కోరుతోంది. రాహుల్‌గాంధీతో గురువారం రిజిజు ఫోన్‌లో మాట్లాడారు. బిల్లును త్వరగా తీసుకొస్తే మహిళా రిజర్వేషన్ల అమలు వేగంగా జరిగే అవకాశం ఉందని అన్నారు. మహిళా రిజర్వేషన్‌లు అమలు కాకపోతే వారిలో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని చెప్పినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 2026 రాజ్యాంగ సవరణ బిల్లు ఏప్రిల్‌లో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో లోక్‌సభ ఆమోదం పొందలేదు. ఈ బిల్లును తిరిగి ప్రవేశపెట్టే అంశంపై ప్రభుత్వం, విపక్షాల మధ్య చర్చ కొనసాగుతోంది.

# జార్ఖండ్ ప్రభుత్వంతో చర్చలు విఫలం..

**మరింత ఉధృతంగా మారనున్న విద్యార్థి ఉద్యమం**



**న్యూఢిల్లీ,ఆగస్టు 8. నవ సంఘర్షణ**
జేపీఎస్‌సీ, జేఎస్ఎస్‌సీ పేపర్ లీకేజీ అంశంపై జార్ఖండ్ ప్రభుత్వంతో విద్యార్థులు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో తమ నిరసన మరింత ఉధృతంగా కొనసాగనున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు ప్రకటించారు. జార్ఖండ్‌లో ఇటీవల జరిగిన జేపీఎస్‌సీ, జేఎస్ఎస్‌సీ పేపర్ లీకేజీలతోపాటు అనేక పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు రాజధాని రాంచీలో నిరవధిక ఆందోళనకు దిగాయి. శనివారం ఈ ఆందోళనలు వరుసగా 15వ రోజుకు చేరుకున్నాయి. ఈ ఉద్యమానికి ప్రధానంగా జేఎల్‌కేఎం నాయకుడు దేవేంద్ర నాథ్ మహతో నాయకత్వం వహిస్తుండగా, రాష్ట్రంలోని ఇతర విద్యార్థి సంఘాలు కూడా మద్దతు ప్రకటించాయి.ఈ నేపథ్యంలో విద్యార్థులతో సీఎం హేమంత్ సోరేన్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం శనివారం చర్చలు జరిపింది. ముందుగా దేవేంద్ర నాథ్ మహతాతో, అనంతరం కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ఎన్ఎస్‌యూఐ, ఏసీఎస్, జేసీఎం వంటి సంస్థల ప్రతినిధులతో ప్రభుత్వం చర్చలు జరిపింది. ఇదే సమయంలో పరీక్ష రాసిన అభ్యర్థులతో కూడా చర్చలు జరిపింది. అయితే, ఈ చర్చలు విఫలమయ్యాయి. విద్యార్థుల పలు డిమాండ్లకు ప్రభుత్వం అంగీకరించలేదు. అందులో ఈ పరీక్షల్ని పూర్తిగా రద్దు చేయాలని దేవేంద్ర నాథ్ మహతో డిమాండ్ చేస్తున్నారు. దీనికి ప్రభుత్వం అంగీకరించలేదు. ఇదే సమయంలో వేర్వేరు విద్యార్థి సంఘాలు, వేర్వేరు డిమాండ్లు చేస్తున్నాయి. ఈ పేపర్ లీకేజీలపై సీఐడీ విచారణ జరపాలని, 90 రోజుల్లో విచారణ పూర్తి చేయాలని, ఎన్‌టీయేలాగా జార్ఖండ్ టెస్టింగ్ ఏజెన్సీ (జేటీయే) పేరుతో కొత్తగా పరీక్ష నిర్వహణా సంస్థ ఏర్పాటు చేయాలని.. ఇలా వేర్వేరు డిమాండ్లు ప్రభుత్వానికి వచ్చాయి. అయితే, వీటిపై ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి స్పష్టతా రాలేదు. కానీ, విద్యార్థుల డిమాండ్లలో న్యాయం ఉందని, వాటిని సీఎంకు తెలియజేస్తామని ప్రభుత్వం తరఫున మంత్రుల బృందం తెలిపింది. ప్రభుత్వంతో చర్చలు సఫలం కాకపోవడంపై విద్యార్థి సంఘాలు స్పందించాయి. తమ డిమాండ్లను ఈ నెల 10లోపు నెరవేర్చాలని తుది హెచ్చరిక జారీ చేశాయి. లేకుంటే తమ నిరసనను మరింత ఉధృతం చేస్తామని చెప్పాయి. రాష్ట్రవ్యాప్తంగా ఘెరావ్‌లు చేపడతామని హెచ్చరించాయి. రెండు వారాలకుపైగా విద్యార్థుల నిరసన కొనసాగుతోంది. మరోవైపు దేవేంద్ర నాథ్ మహతో వారం రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నారు. ఆయనతోపాటు మరికొందరు కూడా దీక్షలో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో దేవేంద్రనాథ్ ఆరోగ్యం క్షీణిస్తుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

# బిజినెస్

## పోకో ఎం8 పవర్ ఫోన్ విడుదల..

**మీడియం బడ్జెట్‌లో పవర్‌ఫుల్ బ్యాటరీ, అమోలెడ్ డిస్‌ప్లే**




చైనాకు చెందిన మొబైల్ తయారీ సంస్థ పోకో నుంచి తాజాగా మీడియ బడ్జెట్‌లో 5జీ స్మార్ట్‌ఫోన్ విడుదలైంది. పోకో ఎం8 పవర్ పేరుతో ఈ నెల 3న ఈ ఫోన్ విడుదలైంది. ఆగష్టు 7నుంచి ఫ్లిప్‌కార్ట్‌లో సేల్‌కు అందుబాటులో ఉంది. పవర్‌ఫుల్ బ్యాటరీ, అమోలెడ్ డిస్‌ప్లే వంటి ఫీచర్లున్నాయి. బ్లాక్, గ్రీన్, బ్లేజ్ ఆరెంజ్ కలర్స్‌లో లభ్యం. కీలక ఫీచర్లివి. 6.9 అంగుళాల ఫుల్ హెచ్‌డీం అమోలెడ్ డిస్‌ప్లే, 120 హెర్జ్ రిఫ్రెష్‌రేట్, 1,800 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్, గొరిల్లా గ్లాస్ 7ఐ ప్రొటెక్షన్, క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 4 జనరేషన్ 4 ప్రాసెసర్, యూఎఫ్ఎస్ 2.2, 8,000 ఎంఏహెచ్ సిలికాన్ కార్బన్ సెల్ బ్యాటరీ, 45 వాట్స్ వైర్డ్ ఛార్జింగ్, 22.5 వాట్స్ రివర్స్ ఛార్జింగ్, ఆండ్రాయిడ్ 16 ఓఎస్ బేస్డ్ హైపర్ ఓఎస్3, నాలుగేళ్లపాటు ఓఎస్ అప్‌డేట్స్, ఆరేళ్లపాటు సెక్యూరిటీ అప్‌డేట్స్, ప్లాస్టిక్ ఫ్రేమ్ బ్యాక్ కవర్, ఐపీ 65 రేటింగ్, 8.4 ఎంఎం థిక్‌నెస్, 225 గ్రామ్స్ బరువు, 50 ఎంపీ రేర్ కెమెరా, 8 ఎంపీ సెల్ఫీ కెమెరా, ఫుల్ హెచ్‌డీ వీడియో రికార్డింగ్, 6జీబీం128 జీబీ (ధర రూ.24,999), 8జీబీం128 జీబీ (ధర రూ.27,999). డిస్కౌంట్, ఎక్స్ఛేంజ్ ఆఫర్లు వర్తిస్తాయి.

## అమ్మకాల్లో దూసుకెళ్తోన్న మారుతి సుజుకి డిజైర్..

**-ఎస్‌యూవీల జోరులోనూ తగ్గని క్రేజ్!**




భారత ఆటోమొబైల్ మార్కెట్‌లో ప్రస్తుతం ఎస్‌యూవీలకు భారీ డిమాండ్ కొనసాగుతోంది. వినియోగదారులు ఎక్కువగా కాంపాక్ట్, మిడ్-సైజ్ ఎస్‌యూవీల వైపు మొగ్గు చూపుతున్నప్పటికీ.. సెడాన్ కార్లకు కూడా ఆదరణ ఏ మాత్రం తగ్గడం లేదు. ముఖ్యంగా మారుతి సుజుకి డిజైర్ తన సెగ్మెంట్‌లో బలమైన అమ్మకాలను నమోదు చేస్తూ మరోసారి తన సత్తాను చాటుతోంది.

మంచి మైలేజ్, తక్కువ నిర్వహణ వ్యయం, విశాలమైన ఇంటీరియర్, ఆకర్షణీయమైన డిజైన్, రీసేల్ విలువ వంటి అంశాలు డిజైర్‌కు ప్రధాన బలంగా మారాయి. దీనికి తోడు మారుతి సుజుకి బ్రాండ్‌పై ఉన్న నమ్మకం, దేశవ్యాప్తంగా విస్తరించిన సర్వీస్ నెట్‌వర్క్ కూడా కస్టమర్లను ఈ కారు వైపు ఆకర్షిస్తున్నాయి.

**నాలుగు నెల్లలోనే దాదాపు 90 వేల యూనిట్లు**

FY27లో ఏప్రిల్ నుంచి జూలై మధ్య కాలంలో మారుతి సుజుకి డిజైర్ మొత్తం 89,816 యూనిట్ల అమ్మకాలను నమోదు చేసింది. అంటే కేవలం నాలుగు నెలల్లోనే దాదాపు 90 వేల మంది కస్టమర్లు ఈ సెడాన్‌ను ఎంచుకున్నారన్నమాట.

ఇక ఖీ26 మొత్తం అమ్మకాలను పరిశీలిస్తే డిజైర్ 2,29,130 యూనిట్ల విక్రయాలను నమోదు చేసింది. ఎస్‌యూవీలకు పెరుగుతున్న ఆదరణ మధ్య కూడా ఈ స్థాయి అమ్మకాలను సాధించడం డిజైర్‌కు ఉన్న మార్కెట్ డిమాండ్‌ను తెలియజేస్తోంది.

**డిజైర్‌కు ఎందుకు ఇంత డిమాండ్?**

మారుతి సుజుకి డిజైర్‌ను కొనుగోలు చేసే కస్టమర్లలో ప్రధానంగా రోజువారీ ప్రయాణాలకు తక్కువ ఖర్చుతో కూడిన కారును కోరుకునే వారు ఎక్కువగా ఉంటారు. ఈ కారు మంచి మైలేజ్ అందించడంతో పాటు నిర్వహణ ఖర్చు కూడా సాధారణంగా అందుబాటులో ఉండటం వినియోగదారులకు కలిసొచ్చే అంశం.

అలాగే కుటుంబ అవసరాలకు సరిపోయే విధంగా క్యాబిన్‌లో మంచి స్థలం అందుబాటులో ఉంటుంది. నగరాల్లో రోజువారీ ప్రయాణాలు, ఆఫీస్ కమ్యూట్‌తో పాటు కుటుంబంతో కలిసి లాంగ్ డ్రైవ్‌లకు కూడా డిజైర్‌ను వినియోగించుకోవచ్చు.

మరోవైపు మారుతి సుజుకి కార్లకు దేశవ్యాప్తంగా ఉన్న సర్వీస్ సెంటర్లు కూడా అదనపు ప్రయోజనంగా నిలుస్తున్నాయి. చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ సర్వీస్ సదుపాయాలు అందుబాటులో ఉండటం వల్ల కారు నిర్వహణ విషయంలో వినియోగదారుల్లో నమ్మకం పెరుగుతోంది.

## నయా పల్సర్ వచ్చింది

**గరిష్ఠ ధర రూ.1.42 లక్షలు**

**పూణె,**

బజాజ్ ఆటో.. దేశీయ మార్కెట్‌కు నయా పల్సర్‌ను పరిచయం చేసింది. పల్సర్‌ను విడుదలై 25 ఏండ్లు పూర్తైన సందర్భంగా పల్సర్ ఎన్160 ఎస్, ఎన్160 ఎస్ఎస్ మాడళ్లను తీసుకొచ్చింది. వీటిలో ఎన్160 ఎస్ ధర రూ.1,33,511గా, ఎన్160 ఎస్ఎస్ ధరను రూ.1,42,585గా నిర్ణయించింది. ఈ ధరలు న్యూఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. కేవలం 4.5 సెకండ్లలో 60 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ బైకులో గూగుల్ మ్యాప్ మిర్రరింగ్‌తో కూడిన 5 టీఎఫ్‌టీ ఉన్నది. ఇలాంటి టెక్నాలజీ అందుబాటులో ఉన్న తొలి దేశీయ స్పోర్ట్స్ బైకు ఇదే కావడం విశేషం.



## టీమిండియాకు గాయాల బెడద




శ్రీలంక పర్యటనలో ఉన్న టీమిండియాను గాయాల బెడద వేధిస్తోంది. ఇప్పటికే జస్‌ప్రీత్ బుమ్రా, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా, నితీష్ కుమార్ రెడ్డి గాయాలతో ఈ పర్యటనకు దూరం కాగా.. జాగా ఈ జాబితాలో సాయి సుదర్శన్ చేరాడు. కాలి బొటన వేలి గాయంతో ఈ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. భారత్-ఏ తరఫున శ్రీలంక-ఏతో జరిగిన సిరీస్‌లో సాయి సుదర్శన్ కాలి వేలికి గాయమైంది. అయినా శ్రీలకంతో రెండు టెస్టుల సిరీస్‌కు సాయి సుదర్శన్‌ను ఎంపిక చేసిన సెలెక్టర్లు.. ఫిట్‌నెస్ నిరూపించుకుంటే సిరీస్‌లో కొనసాగుతాడని తెలిపారు. అయితే తాజాగా నిర్వహించిన వైద్య పరీక్షల్లో సాయి సుదర్శన్ గాయం తగ్గలేదని తేలింది. దాంతో అతను ఈ సిరీస్ మొత్తానికి దూరం కావాల్సి వచ్చింది. అయితే సాయి సుదర్శన్ దూరమవ్వడంపై బీసీసీఐ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఆ సమయంలోనే అతనికి రిప్లేస్‌మెంట్‌గా మరో ఆటగాడిని ఎంపిక చేయవచ్చు. సాయి సుదర్శన్ స్థానంలో తెలుగు తేజం షేక్ రషీద్‌ను ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు చెందిన షేక్ రషీద్‌కు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మెరుగైన రికార్డ్ ఉంది. ముఖ్యంగా టాపార్డర్ బ్యాటర్‌గా అతని రికార్డ్స్ మెరుగ్గా ఉన్నాయి. ఇప్పటి వరకు 29 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన షేక్ రషీద్ 46.64 సగటుతో 1959 పరుగులు చేశాడు. ఇందులో 5 శతకాలతో పాటు 10 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఇటీవల శ్రీలంక-ఏ జరిగిన అనధికారిక టెస్ట్ సిరీస్‌లోనూ షేక్ రషీద్ మెరుగైన ప్రదర్శన కనబర్చాడు. మూడు ఇన్నింగ్స్‌ల్లో 63, 20, 45 పరుగులతో రాణించాడు. అయితే షేక్ రషీద్‌కు సర్ఫరాజ్ ఖాన్‌తో పోటీ నెలకొంది. అయితే ఐపీఎల్ తర్వాత సర్ఫరాజ్ ఖాన్ ఎలాంటి ప్రొఫెషనల్ క్రికెట్ ఆడలేదు. సీనియర్లకు ప్రాధాన్యత ఇస్తే సర్ఫరాజ్ ఖాన్‌కు అవకాశం లభిస్తుంది. సెలెక్టర్లు సర్ఫరాజ్ ఖాన్‌తో పాటు షేక్ రషీద్ పేర్లను సాయి సుదర్శన్‌కు రిప్లేస్‌మెంట్‌గా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. రుతురాజ్ గైక్వాడ్ కూడా రేసులో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.

## వామప్ మ్యాచ్‌లో పోరాడుతోన్న భారత్



శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్‌కు సన్నాహకంగా జరుగుతున్న వామప్ మ్యాచ్‌లో భారత్ పోరాడుతోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 90 ఓవర్లలో 8 వికెట్లకు 357 పరుగులు చేసింది. దేవదత్ పడిక్కల్(164 బంతుల్లో 18 ఫోర్లతో 142 నాటౌట్) అజేయ సెంచరీతో చెలరేగగా.. రవీంద్ర జడేజా(117 బంతుల్లో 7 ఫోర్లతో 63) హాఫ్ సెంచరీతో రాణించాడు. మానవ్ సుతార్(90 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 41), సరాన్ష్ జైన్(22), గుర్నూర్ బ్రార్(17 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 36 నాటౌట్) విలువైన పరుగులు చేశారు. శ్రీలంక ఎలెవన్ బౌలర్లలో రమేష్ మెండీస్, అసంక మనోజ్ రెండేసి వికెట్లు తీయగా.. విశ్వ ఫెర్నాండో, కేశర నువాంత తలో వికెట్ తీసారు. భారత్ ఇంకా శ్రీలంక కంటే 6 పరుగుల వెనుకంజలో ఉంది. రెండో రోజు ఆటలో బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే బిగ్ షాక్ తగిలింది. విశ్వ ఫెర్నాండో వేసిన తొలి ఓవర్ రెండో బంతికే యశస్వి జైస్వాల్(0).. దిలుమ్ సుదీర్‌కు క్యాచ్ ఇచ్చి సిల్వర్ డక్‌గా వెనుదిరిగాడు. వైడ్‌బాల్‌ను వెంటాడి మరీ మూల్యం చెల్లించుకున్నాడు. కెప్టెన్ కేఎల్ రాహుల్‌తో పాటు, దేవదత్ పడిక్కల్ ఆచితూచి ఆడి రెండో వికెట్‌కు 96 పరుగులు జోడించారు. హాఫ్ సెంచరీకి చేరువైన కేఎల్ రాహుల్(40)ను నువాంత క్లీన్ బౌల్డ్ చేశాడు. రవీంద్ర జడేజా సాయంతో ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించిన దేవదత్ పడిక్కల్ 121 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఆ మరుసటి బంతికే రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. దాంతో క్రీజులోకి రిషభ్ పంత్ వచ్చాడు. కానీ అతను ఐదు బంతుల్లో 2 పరుగులు చేసి క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ధ్రువ్ జురెల్ కూడా ఆ కాసేపటికే క్యాచ్ ఔటయ్యాడు. ఈ ఇద్దరినీ స్పిన్నర్ రమేష్ మెండీస్ పెవిలియన్ చేర్చాడు. దాంతో భారత్ 174 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో జడేజా, మానవ్ సుతార్ జట్టును ఆదుకున్నారు. ఈ ఇద్దరూ ఆరో వికెట్‌కు 76 పరుగులు జోడించారు. హాఫ్ సెంచరీ అనంతరం రవీంద్ర జడేజా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగ్గా.. కుల్దీప్ యాదవ్(1) గాయంతో తప్పుకున్నాడు. మహమ్మద్ సిరాజ్(1) క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. సరాన్ష్ జైన్(22) పరుగుల తర్వాత రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగ్గా.. దేవదత్ పడిక్కల్ తిరిగిన బ్యాటింగ్‌కు వచ్చాడు. గుర్నూర్ బ్రార్‌తో కలిసి అతను రెండో రోజు ఆటను ముగించాడు.

# స్పోర్ట్స్

## ట్రావిస్ హెడ్‌కు అలన్ బోర్డర్ మెడల్

**వరుసగా రెండో ఏడాది హెడ్ కైవసం**



ఆస్ట్రేలియా విధ్వంసకర ఓపెనర్ ట్రావిస్ హెడ్‌కు ప్రతిష్టాత్మక అవార్డ్ వరించింది. ఆస్ట్రేలియా అత్యున్నత పరుస్కారమైన అలన్ బోర్డర్ మెడల్‌ను వరుసగా రెండో ఏడాది కూడా ట్రావిస్ హెడ్ కైవసం చేసుకున్నాడు. బ్రిస్బేన్ వేదికగా జరిగిన క్రికెట్ ఆస్ట్రేలియా అవార్డుల కార్యక్రమంలో దిగ్గజ కెప్టెన్ అలన్ బోర్డర్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని ఈ సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాడు అందుకున్నాడు. దాంతో వరుసగా రెండో ఏడాది అలెన్ బోర్డర్ మెడల్ అందుకున్న ఐదో ఆసీస్ ప్లేయర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో ఆస్ట్రేలియా దిగ్గజ ఆటగాళ్లు అయిన రికీ పాంటింగ్, మైఖేల్ క్లార్క్, డేవిడ్ వార్నర్, షేన్ వాట్సన్ సరసన చేరాడు. ఈ ప్రతిష్టాత్మక అవార్డు కోసం జరిగిన ఓటింగ్‌లో ట్రావిస్ హెడ్ కేవలం ఒక్క ఓటు తేడాతో గెలుపొందడం గమనార్హం. తన సహచర ఆటగాడు, ఆస్ట్రేలియా వికెట్ కీపర్ బ్యాటర్ అలెక్స్ క్యారీ 152 ఓట్లతో రెండో స్థానంలో నిలిచి తృటిలో ఈ ప్రతిష్టాత్మక అవార్డును కోల్పోయాడు. ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ 150 ఓట్లతో మూడో స్థానంలో నిలిచాడు. 2025 జనవరి 29 నుంచి 2026 జనవరి 8 వరకు ఉన్న ఓటింగ్ వ్యవధిలో ట్రావిస్ హెడ్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. గతేడాది ఆస్ట్రేలియా తరఫున మూడు ఫార్మాట్లలో 30 మ్యాచ్‌లు ఆడిన ట్రావిస్ హెడ్.. 1,437 పరుగులు సాధించి ఆసీస్ తరఫున టాప్ రన్ స్కోరర్‌గా నిలిచాడు. ముఖ్యంగా యాషెస్ సిరీస్‌లో మూడు సెంచరీలతో ఆసీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇదే కార్యక్రమంలో షేన్ వాట్సన్ టెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్‌గా మిచెల్ స్టార్క్, వన్డే ప్లేయర్ ఆఫ్ ది ఇయర్‌గా మిచెల్ మార్ష్, టీ20 ప్లేయర్ ఆఫ్ ది ఇయర్‌గా టిమ్ డేవిడ్ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ట్రావిస్ హెడ్.. అలన్ బోర్డర్ సమక్షంలో వరుసగా రెండోసారి ఈ మెడల్ అందుకోవడం సంతోషంగా ఉందని చెప్పాడు. ఇది తనకు దక్కిన గొప్ప గౌరవమని పేర్కొన్నాడు. అప్‌కమింగ్ బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ, వన్డే ప్రపంచకప్‌లపైనే తన పూర్తి దృష్టి ఉందని స్పష్టం చేశాడు.

# రవితేజ 'ఇరుముడి' ట్రైలర్‌కు ముహూర్తం ఫిక్స్..

## భీమవరంలో గ్రాండ్‌గా రిలీజ్!




మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి'. 'నిన్ను కోరి', 'టక్ జగదీష్' వంటి చిత్రాలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది.ఇప్పటివరకు సినిమాకు సంబంధించి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, ఇతర ప్రచార చిత్రాలు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్‌ను అందుకున్నాయి. ముఖ్యంగా కుటుంబ కథాంశానికి భక్తి అంశాలను జోడించి సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తుండటంతో 'ఇరుముడి'పై అంచనాలు మరింత పెరిగాయి.ఇప్పటివరకు వచ్చిన ప్రమోషనల్ కంటెంట్‌తో సినిమాపై బజ్ క్రియేట్ చేసిన మేకర్స్.. ఇప్పుడు అతిపెద్ద ప్రమోషనల్ అప్‌డేట్‌కు సిద్ధమయ్యారు. అదే 'ఇరుముడి' థియేట్రికల్ ట్రైలర్. తాజా సమాచారం ప్రకారం ఆగస్టు 12న 'ఇరుముడి' ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. భీమవరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి చిత్ర బృందంతో పాటు అభిమానులు, సినీ ప్రేక్షకులు భారీగా హాజరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే 'ఇరుముడి' నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై పాజిటివ్ వైబ్స్‌ను తీసుకొచ్చింది. దీంతో ట్రైలర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ భావోద్వేగాలు, భక్తి అంశాలతో పాటు రవితేజకు సంబంధించిన మాస్ ఎలివేషన్స్‌ను ట్రైలర్‌లో ఎలా చూపించారనేది ఆసక్తికరంగా మారింది. ట్రైలర్ కూడా ప్రేక్షకులను మెప్పిస్తే సినిమా విడుదలకు ముందే హైప్ మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రవితేజను శివ నిర్వాణ ఏ తరహా పాత్రలో చూపించారనే విషయం ట్రైలర్ ద్వారా స్పష్టత వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తున్నారు. రవితేజ కుమార్తె పాత్రలో బేబీ నక్షత్ర కనిపించనుంది. కుటుంబ బంధాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉన్న కథలో ఈ తండ్రీకూతుళ్ల బంధం కీలకంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది.మాస్ మహారాజా ఇమేజ్‌కు భిన్నంగా కుటుంబ భావోద్వేగాలను, భక్తి అంశాలను కలగలిపి శివ నిర్వాణ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. దీంతో 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లో మరో విభిన్నమైన సినిమాగా నిలుస్తుందా అన్న ఆసక్తి నెలకొంది. కాగా 'ఇరుముడి' ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. రిలీజ్‌కు కేవలం కొద్ది రోజుల ముందు ఆగస్టు 12న ట్రైలర్‌ను విడుదల చేయడం ద్వారా ప్రమోషన్స్‌ను మరింత వేగవంతం చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.



## అనుపమ సూపర్ హాట్ షో..

# మూడు పాత్రల్లో విశాల్ విశ్వరూపం..

## -'మకుటం' ట్రైలర్ అదిరిపోయిందిగా!




కోలీవుడ్ స్టార్ హీరో విశాల్ తొలిసారి దర్శకుడిగా మెగాఫోన్ పట్టి తెరకెక్కించిన చిత్రం 'మకుటం'. ఆర్.బి. చౌదరి సమర్పణలో ప్రతిష్టాత్మక సూపర్‌గుడ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా ఆ సంస్థకు 99వ ప్రాజెక్ట్‌గా తెరకెక్కింది. విశాల్ సరసన అంజలి, దుషార విజయన్ కథానాయికలుగా నటించగా.. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్, పాటలకు మంచి స్పందన లభించగా.. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. సుమారు 2 నిమిషాల 45 సెకన్ల నిడివితో ఉన్న 'మకుటం' ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. యాక్షన్, కామెడీ, రొమాన్స్, ఎమోషన్, డ్రామా అంశాలను మేళవించి సినిమాను తెరకెక్కించినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ముఖ్యంగా విశాల్ మూడు విభిన్నమైన షేడ్స్‌లో కనిపించడం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది.ఒకవైపు కృపాకర్ అనే మెడికల్ రిప్రజెంటేటివ్ పాత్రలో విశాల్ కనిపించాడు. కుటుంబమే తన ప్రపంచంగా భావించే వ్యక్తిగా ఈ పాత్రను చూపించారు. మరోవైపు లింగా అనే హార్బర్ కాంట్రాక్టర్ పాత్రలో పూర్తిగా భిన్నమైన గెటప్, బాడీ లాంగ్వేజ్‌తో కనిపించాడు. హార్బర్‌లో సరుకుల స్మగ్లింగ్ చేసే లింగా జీవితంలోకి కృపాకర్ అనుకోకుండా రావడంతో ఇద్దరి మధ్య గొడవ మొదలవుతుంది. ట్రైలర్‌లో అత్యంత ఆసక్తిని రేకెత్తిస్తున్న అంశం విశాల్ పోషించిన మూడు పాత్రలే. కృపాకర్, లింగా మాత్రమే కాకుండా మరో విభిన్నమైన పాత్రలో కూడా విశాల్ కనిపించాడు. అయితే ఈ ముగ్గురు వేర్వేరు వ్యక్తులా? లేక ఒకే వ్యక్తికి సంబంధించిన మూడు కోణాలా? అనే సస్పెన్స్‌ను దర్శకుడు ట్రైలర్‌లో రివీల్ చేయకుండా మెయింటైన్ చేశారు. 'వీరిద్దరూ ఎందుకు కొట్టుకుంటున్నారు?', 'కడలిని శాసించేది ఎవరు?', 'ఈ ముగ్గురి మధ్య ఉన్న అసలు సంబంధం ఏమిటి?' అనే ప్రశ్నలను ప్రేక్షకుల్లో కలిగించేలా ట్రైలర్‌ను కట్ చేశారు. దీంతో సినిమా కథపై ఆసక్తి పెరుగుతోంది. విశాల్‌కు జోడీగా నటించిన అంజలి పాత్రను కూడా ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. దుషార విజయన్ కూడా కీలక పాత్రలో కనిపించనున్నారు. విశాల్‌తో పాటు వీరిద్దరి పాత్రలు కథలో ఎలాంటి మలుపులు తీసుకురానున్నాయనేది ఆసక్తికరంగా మారింది. ఈ సినిమాలో విశాల్ ఒక పాత్రలో ఇళయరాజా అభిమానిగా కనిపించడం కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పాత్రల మధ్య వేరియేషన్, గెటప్స్, బాడీ లాంగ్వేజ్‌లో చూపించిన తేడాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ట్రైలర్‌లోనే విశాల్ నటనలోని వైవిధ్యం స్పష్టంగా కనిపించింది. హీరోగా ఎన్నో యాక్షన్ సినిమాల్లో మెప్పించిన విశాల్.. 'మకుటం'తో తొలిసారి దర్శకుడిగా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ట్రైలర్‌ను చూస్తే కథను తెరపై ప్రెజెంట్ చేసే విధానంలోనూ తనదైన మార్క్ చూపించినట్లు అనిపిస్తోంది. యాక్షన్ సన్నివేశాలను, పాత్రల మధ్య సంఘర్షణను, కథలోని సస్పెన్స్‌ను ఆసక్తికరంగా ఎలివేట్ చేశారు. హీరోగా మాత్రమే కాకుండా దర్శకుడిగా కూడా విశాల్ ఎలాంటి మార్క్ వేస్తాడో తెలుసుకోవాలంటే ఆగస్టు 14 వరకు వేచి చూడాల్సిందే.



# రామ్‌చరణ్‌కు జోడీగా రుక్మిణి వసంత్ ?

కన్నడ సొగసరి రుక్మిణి వసంత్ తారాపథంలో దూసుకుపోతున్నది. ప్రస్తుతం ఈ భామ యశ్ 'టాక్సిక్', ఎన్టీఆర్ 'డ్రాగన్' వంటి భారీ చిత్రాల్లో నాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. 'కాంతార ఛాప్టర్-1' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో ఆమె పాపులర్ అయింది. అప్పటి నుంచి వరుసగా భారీ చిత్రాల్లో అవకాశాలు వరిస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం తెలుగులో ఈ భామ మరో ప్రతిష్టాత్మక చిత్రంలో నాయికగా ఖరారుకాబోతున్నదని వార్తలొస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. అగ్ర హీరో రామ్‌చరణ్ తన తదుపరి చిత్రాన్ని సుకుమార్ డైరెక్షన్‌లో చేయబోతున్న విషయం తెలిసిందే. 'రంగస్థలం' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరి కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి. వచ్చే నెల లాంఛనంగా ప్రారంభించి..నవంబర్‌లో సెట్స్‌మీదకు తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం కథానాయిక అన్వేషణలో ఉన్న చిత్రబృందం పలువురు అగ్ర నాయికల పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. వారిలో రుక్మిణి వసంత్ ఖరారయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని ఫిల్మ్‌నగర్ టాక్. మరి ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే మేకర్స్ అధికారికంగా ధృవీకరించాల్సిందే.

# ఆసుపత్రి పాలైన అవికా గోర్..

## -104 డిగ్రీల జ్వరంలోనూ షూటింగ్ చేసిన 'చిన్నారి పెళ్లికూతురు'



టెలివిజన్ ప్రేక్షకులను ఎంతగానో అలరించిన 'బాలికా వధు' (చిన్నారి పెళ్లికూతురు) ఫేమ్ అవికా గోర్ ప్రస్తుతం అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. గత కొన్ని రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్న ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ పాజిటివ్‌గా తేలింది. ప్రస్తుతం ఆమె ముంబైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అవికా గోర్ భర్త మిలింద్ చంద్వానీ సోషల్ మీడియా వేదికగా ఆమె ఆరోగ్య పరిస్థితిని వెల్లడించారు. గత ఐదు రోజులుగా ఆమె ఏకంగా 104 డిగ్రీల జ్వరంతో బాధపడుతున్నప్పటికీ, షూటింగ్‌కు ఎలాంటి అంతరాయం కలగకూడదనే ఉద్దేశంతో తన వృత్తిపై ఉన్న అంకితభావాన్ని చాటుకున్నారు. నిర్మాతలకు నష్టం జరగకూడదనే ఆలోచనతో ఆమె తీవ్ర అనారోగ్యంలోనూ షూటింగ్‌లలో పాల్గొనడమే కాకుండా, ఒక యాడ్ షూట్ కోసం ఢిల్లీకి కూడా ప్రయాణించారు. అయితే నీరసం మరియు జ్వరం మరింత పెరగడంతో ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది.ఆసక్తికరమైన విషయమేమిటంటే, ఆమె నటించిన సరికొత్త హిందీ మ్యూజిక్ ఆల్బమ్ 'బుఖార్' (జ్వరం) విడుదలైన రోజే ఆమె నిజంగానే జ్వరంతో ఆసుపత్రిపాలవడం గమనార్హం. ఆసుపత్రి మంచంపై నుంచే తన పాట విడుదలైన విషయాన్ని అభిమానులతో పంచుకున్న ఆమె, తన ప్లేట్‌లెట్ కౌంట్ తగ్గుతోందని, డెంగ్యూ ప్రభావం చాలా తీవ్రంగా ఉందని పేర్కొంటూ విక్టరీ సింబల్ చూపించారు. బాలనటిగా కెరీర్ ప్రారంభించి దేశవ్యాప్తంగా అపారమైన గుర్తింపు తెచ్చుకున్న అవికా గోర్ త్వరగా కోలుకోవాలని ఆమె అభిమానులు, సినీ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు.